
ఫ్లయింగ్
బాంబ్
MVS
PUBLICATIONS
మధుబాబు

# ఫ్లయింగ్ బాంబ్

"మైగాడ్! షాడోని ప్రాణాలతో బంధించి వుంచటం చాలా కష్టం. చంపేద్దాం. శవాన్ని తీసుకుపోయి చూపిద్దాం మనవాళ్ళకి."

"పిచ్చి ఆలోచనలు చెయ్యకు ప్రాణాలతో తీసుకో రాగలిగితే చాలా మంచిదని మనకు ఆర్డర్లు యివ్వబడ్డాయి. షాడోచేత మాటాడించ గలిగితే ఇండియన్ సి.ఐ.బి. అంతు చూడవచ్చు......"

"మాటాడించ గలిగితే కదా! ఆ పని సాధ్యపడుతుందన్న నమ్మకం నాకు లేదు. మామూలు మనిషి అయితే నాలుగుదెబ్బలు తిన్న తరువాత ఐదో దెబ్బకు నోరు విప్పుతాడు. నో....సర్..... ఈ దుర్మార్గుడు మనిషి కాదు."

కనురెప్పల సందునుంచి ఆ మాటలు వచ్చిన దిశకు చూశాడు షాడో. ఎదురుగానే వున్నారు నలుగురు దృఢకాయులు. నలుగురి చేతుల్లోనూ మిషన్ గన్స్ వున్నాయి, వాటి బారెల్స్ షాడోవైపే గురిపెట్టబడి వున్నాయి.

కళ్ళు మూసుకున్నాడు షాడో. తలమీద పలుగులతో పొడిచినట్లు బాధ.... మెడమీద పదునైన కత్తి దిగబడినట్లు నొప్పి.... వళ్ళంతా విరగొట్టబడినట్లు సలుపు..... అన్నీ కలిపి అతని ఆలోచనలను ఒక్క అడుగుకూడా ముందుకు సాగనీయకుండా అడ్డుపడుతున్నాయి.

బిందుతో సెకండ్ షో సినిమాకు పోయి వస్తున్నాడు తను..... థియేటర్‌లో నుంచి బయటకురాగానే ఎవరో అనుసరిస్తున్నట్లు అనిపించింది. ఎందుకైనా

మంచిదని బిందును యింటికి పొమ్మని హెచ్చరించి తను ఒంటరిగా బయలు దేరాడు.

అంతే..... అంతవరకే క్లియర్‌గా జ్ఞాపకముంది. ఆ తర్వాత అంతా అయోమయం-- ఆలోచించటానికిగాని..... జ్ఞాపకం పెట్టుకోవటానికి గాని వ్యవధి లేకుండా పోయింది.

థియేటర్‌ని దాటి వందగజాలు కూడా పోకముందే రివాల్వర్ మోతలతో దద్దరిల్లిపోయింది ఆ నిశబ్ధ నిశీధి.

ఎవరో, ఎందుకు కాల్పులు జరుపుతున్నారో షాడోకు అర్ధంకాలేదు. కాని శరీరాన్ని రాచుకుంటూ పోతున్న బుల్లెట్లను గమనించగానే తనకోసమే ఆ గందరగోళం అన్న విషయం బాగా అర్థమైంది.

తప్పించుకోవటానికి ప్రయత్నించాడు. కుదరలేదు. పంచకల్యాణి గుర్రంమీద పరుగులు తీస్తూవుండే అదృష్టదేవత ఆ రోజు మొగం చాటుచేసుకుంది.

ఒక బుల్లెట్ సూటిగా వచ్చి మెడను గాయపరచటంతో...... తూలి ఫుట్‌పాత్ మీద పడిపోయాడు. తిరిగి లేచే అవకాశం లభించలేదు. తనమీద పది టన్నుల బరువు పడినట్లయింది. కాళ్ళు చేతులను ఎవరో విరగగొట్టున్నట్లు అనిపించింది. ఆ తర్వాత ఏమీ తెలియలేదు..... కళ్ళముందు గాఢాంధకారం ప్రత్యక్షమయింది.

తిరిగి స్పృహ వచ్చేసరికి ఏవో మాటలు వినబడ్డాయి కను చివరలనుంచి చూసేసరికి మిషన్ గన్ బారెల్స్ కనపడి శరీరం జలదరించింది.

ఎవరో తన దగ్గిరికి వస్తున్నట్లు అనిపించటంతో షాడో ఆలోచనలు అంతంఅయ్యాయి. మళ్ళీ కనురెప్పల చాటునుంచి ముందుకు చూశాడు.

పొడుగాటి సిరంజీని పట్టుకున్న వ్యక్తి ఒకడు షాడోని సమీపించాడు. "ఒక ఇంజక్షన్ సరిపోదు. రెండు మూడు యివ్వండి..... మనం కరాచీ చేరుకునేదాకా యీ దుర్మార్గుడు నిద్ర లేవకూడదు" కామెంట్ చేశాడు మిషన్ గన్ పట్టు కుని వున్నవారిలో ఒకతను.

"డర్టీ బాస్టర్డ్! షటప్! అధిక ప్రసంగం చేస్తే నీ తల ఎగిరిపోతుంది" కోపంగా మందలించాడు అతని సహచరుడొకడు.

నోరు మూసుకున్నాడా వ్యక్తి. సిరంజి షాడో కుడిభుజంలో దిగబడింది. అందులోవున్న తెల్లటిద్రవం శరీరంలోని ప్రవేశించిన మరుక్షణం షాడో మొదడు మొద్దుబారటం ప్రారంభించింది.

తన్నుకుంటూ వచ్చింది నిద్ర మెలుకువగా వుండాలని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది, మత్తు నిద్రలోకి జారిపోతున్న సమయంలో షాడో మనస్సు చేస్తున్న ఆలోచన ఒక్కటే......

కరాచీ! తనను కరాచీ తీసుకుపోతున్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఏజెంట్లపనా ఇది? లేక కిల్లర్స్ గాంగ్ ఆడుతున్న మరో జగన్నాటకమా?

* * *

కన్ను పొడుచుకున్నా కానరాని కటికచీకటి. ఆ చీకటిలో రేడియంలా ప్రకాశిస్తున్న కళ్ళతో.... పొడుగాటి చేతులను జాచి పట్టుకోవటానికి వస్తున్న ఒక భయంకర ఆకారం... ....

షాడో గొంతు ఎండిపోయింది. శరీరమంతా చెమటలు పట్టాయి. తప్పించుకోవాలని ప్రయత్నించాడు. అవయవాలు స్వాధీనంలో లేవు.

ఒక్కసారిగా మీదికి దూకిందా ఆకారం, ఆ అదుటుకు పక్కకు దొర్లాడు షాడో. దొర్లి, దొర్లి మంచంమీది నుంచి కిందపడ్డాడు.

తల నేలకు గుద్దుకొని ఖంగుమని శబ్దం చేసింది. ఆ దెబ్బకు తిరిగి యీ ప్రపంచంలోకి వచ్చాడు షాడో. మెలుకువ వచ్చింది. కలకరిగిపోయింది.

కళ్ళు తెరిచి చూశాడు.

అంతకు ముందు మిషన్ గన్స్‌తో కాపలా వున్న వారెవరూ కనిపించలేదు. దిమ్మెక్కిన మెదడును స్వాధీనం లోకి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ మెల్లిగా లేచికూర్చున్నాడు.

నాలుక పిడచకట్టుకు పోయింది. గొంతు ఎండిపోయి... విపరీతమైన దాహం వేస్తోంది. మత్తు యింజక్షన్స్ విపరీతంగా తీసుకుంటే అలాగే వుంటుంది.

అప్రయత్నంగా వాచివంక చూశాడు. మూడుగంటలు సూచిస్తోందది.

రాత్రా? పగలా?

సమ్మె చేస్తామని బెదిరిస్తున్న అవయవాలను అతిప్రయత్నంమీద లొంగ తీసుకొని లేచి నిలబడ్డాడు.

ధన్‌మని పై కప్పుకు గుద్దుకుంది తల.

కళ్ళు బైర్లు క్రమ్మి, మళ్ళీ నేలమీద చతికిల బడిపోయాడు.

రెండు నిముషాలు పట్టింది తేరుకోవటానికి ఆ తర్వాత అన్ని విషయాలు క్లియర్‌గా తెలిసివచ్చాయి.

ఇనప పెట్టెలాంటి గదిలో బంధింపబడి వున్నాడు తను. ఒక మూల వెలుగుతున్న, జీరోవాల్టు బల్బు ఆ ప్రదేశాన్ని మసకవెలుగుతో నింపుతోంది.

ఇచ్చిన మత్తు యింజక్షన్స్ మీదా, యినప్పెట్టెలాంటి ఆ గదిమీదా విపరీతమైన నమ్మకం వుంది కాబోలు.... షాడోని వదిలిపెట్టి ధైర్యంగా అవతలకి వెళ్ళారు... ఆ ఆగంతకులు.

ఎవరు వాళ్ళు?

ఆలోచనలు అటు తిరిగి ఇటు తిరిగి మళ్ళీ మొదటికి రావటంతో..... విసుగ్గా తల విదిలించి, యీసారి జాగ్రత్తగా లేచి నిలబడ్డాడు షాడో.

బంధించింది ఎవరైనా.... తనమీది ప్రేమతో గాని, తనను సన్మానించి గౌరవించటానికి బంధించలేదు. ఆ సంగతి తిన్న దెబ్బలు.... తీసుకున్న మత్తు ఇంజక్షన్‌లు క్లియర్‌గా ఎత్తి చూపిస్తున్నాయి. కాళ్ళు చేతులు సరిగ్గా వున్నప్పటికీ అక్కడినుంచి బయటపడే ప్రయత్నం చేసుకోవటం మంచిది!!

అక్కడితో షాడో ఆలోచనలు ఫ్రీగా ముందుకు సాగటం అంతమయింది.

రోషం, అభిమానం మొదలైనవన్నీ ఆక్రమించుకున్నాయి ఆ క్షణంనుంచీ.

తనను బంధించింది ఎవరో తెలుసుకోవాలి! తెలుసుకొని.... ప్రతీకారం చేసితీరాలి!!

గది నాలుగుగోడలను జాగ్రత్తగా పరిశీలించాడు షాడో. ఇనుప రేకులతో చేయబడివున్నాయి గోడలు. ఒకే ఒక తలుపు ఉంది. అదికూడా యినుముతో తయారు చేయబడినదే.

ఎటు చూసినా – ఎంత ప్రయత్నించినా, చీమ తల దూరే చిన్న సందు కూడా కన్పించలేదు షాడో కళ్ళకు.

గాలి మాత్రం వస్తోంది.... లెక్కప్రకారం రాకూడదు.

జాగ్రత్తగా క్రిందికి వంగి, తలను ఎత్తిపై కప్పును పరిశీలించాడు. జీరోవాల్ట్ బల్బువున్న ప్రదేశం పక్కగా.... జల్లెడలాంటి రేకుముక్క సీలింగ్‌కి అతుకు వేయబడి వుంది.

అందులోనుంచి జోరుగా వీస్తున్నది గాలి. గదిలోని గాలి.... మరోమూల వున్న అదేమాదిరి యినుప జల్లెడలో నుంచి బయటికి పోతున్నది.

ఆ గాలిని కంట్రోల్ చేస్తే..... చాలు. గదిలో వున్న వాళ్ళు పైకి ప్రయాణం కట్టక తప్పదు.

ఇనుప జల్లెళ్ళను రెంటినీ జాగ్రత్తగా పరీక్షించాడు షాడో. ఒకటి మాత్రం కొంచెం లూజుగా ఉన్నట్టు అనిపించింది. దాన్ని తొలిగిస్తే అరచేయంత రంధ్రం ఏర్పడుతుంది.

తప్పించుకునే ప్రయత్నానికి ఏమాత్రము సహకరించని దారి అది. అయినా వూరికే కూర్చోవటంకంటే, ఏదో ఒకపాడుపని చేసి చూపటంలో తప్పేముంది?

అప్రయత్నంగా బూటుమీదికి పోయింది షాడో చేయి. మధ్యలోనే జ్ఞాపకంవచ్చి... దీర్ఘంగా నిట్టూర్చాడు.

రెస్ట్ పీరియడ్‌లో ఉండగా, అదనుచూసి తల విసిరారు శత్రువులు. ఆయుధాలు వెంటపెట్టుకు తిరగటం– రెస్ట్ పీరియడ్‌లో తనకు అలవాటులేదు. రివాల్వర్ , డాగర్ , మొదలైనవన్నీ బిందు ఎపార్ట్‌మెంట్‌లో వుండిపోయాయి.

జేబులో వుండవలసిన సిగిరెట్ పాకెట్, అగ్గిపెట్టె.... శత్రువుల చేతిలోకి పోయాయి.

లూజుగా వున్న జల్లెడను మరోసారి కదిలించి చూసి – పిడికిలితో బలంగా పొడిచాడు.

వ్రేళ్ళవెనుక చర్మం దోక్కుపోయి.... రక్తం వెలువడింది. అయినా.... ఫలితం మాత్రం కనిపించింది.

ఇనుప జల్లెడ..... లోపలికి వంగిపోయింది.

ఏర్పడిన కంతలోకి చేయి దూర్చి.... సీలింగ్‌ని తడిమి చూశాడు. ఫాల్స్ సీలింగ్ అది. అసలు పైకప్పుకు... కింద వున్న యినుపరేకుకు మధ్య జానెడు ఖాళీ వుంది.

షాడో మనస్సులో చిన్న ఆలోచన మెదిలింది, రెండు చేతులను కంతలోకి జొనిపి.... బలంగా కిందికి లాగాడు.

మొదటి ప్రయత్నం ఫలించలేదు, రెండవసారి... మూడవసారి... నాలుగో ప్రయత్నం..... ఒక్కసారిగా ఫలించింది.

బాలెన్స్ తప్పి... నేలమీద చతికిలపడ్డాడు. పైన వుండవలసిన ఇనుప సీలింగ్ వూడి అతని నెత్తిమీద పడి... ధన్ మని రీసౌండ్ యించ్చింది.

కళ్ళముందు మళ్ళీ నక్షత్రాలు ప్రత్యక్షమయ్యాయి.

ఒరిజినల్ సీలింగ్ కాంక్రీట్‌తో చేయబడివుంది. ఆ గదిలో బంధించబడిన వారిని మానసికంగా బెదరగొట్టడానికి అలా ఇనుపరేకులు అమర్చారు.

రేకును మళ్ళీ యధాస్థానంలోకి చేరుస్తూ సాలోచనగా తల పంకించాడు షాడో.

అది పాకిస్థాన్ ఏజంట్ల పనికాదు. అటువంటి మునుగులో గుద్దులాటల వ్యవహారాలు వాళ్ళు చేయరు. కిల్లర్స్ గాంగ్.... ఏమో!!

ఎంత జాగ్రత్తగా అమర్చినా.... సీలింగ్ ఓటి సీలింగ్ అయినట్లు కన్పిస్తోంది. గోడను బలంగా తడితే చాలు.... సీలింగ్ ఒక్కసారిగా కింద వడిపోతున్నది. ఆ గొడవలో..... బల్బు పగిలిపోయింది. గది నిండా గాడాంధకారం ఆవరించుకుంది.

ఒకమూల బాసిపట్టు వేసుకుకూర్చుని.... టైం పాస్ చేయటం ప్రారంభించాడు షాడో.

చేతి గడియారం.... ఎనిమిదిగంటలు సూచిస్తుండగా.... గది తలుపులు తెరుచుకున్నాయి.

సీలింగ్ కిందికి జారదుకదా... అని భయపడుతూ లోనికి వచ్చినవారిని జాగ్రత్తగా గమనించాడు షాడో.

“నిద్ర లేచాడు.... మనం అనుకున్నట్లే పారిపోవటానికి ప్రయత్నించినటున్నాడు. లైటు పగిలిపోయింది” నవ్వుతూ అన్నాడో వ్యక్తి ద్వారంలో నిలబడి.

టార్చిలైటు వెలిగింది. దాని వెలుగుతో గది ప్రకాశవంతం అయింది. నాలుగు లావాటి రొట్టెలు, ఒక రేకుగ్లాసు నిండా పొగలు కక్కుతున్న టీ... షాడో ముందు వుంచబడ్డాయి.

మిషన్ గన్స్ పట్టుకొని లోపలకు వచ్చి నిలబడ్డారు నలుగురు వ్యక్తులు. గదిబయట మరెవ్వరూ లేరు.

"మిస్టర్ షాడో! రెండు రోజులనుంచీ తిండి పెట్టకుండా మాడ్చాం... పాపం అకలితో బాధపడుతూ వుండివుంటావ్ .... ముందు కడుపు నింపుకొని ఆ తర్వాత పారిపోయే మార్గంకోసం తీరికగా వెతుక్కో... " అన్నాడొక వ్యక్తి

మిగిలిన ముగ్గురూ గొల్లుమని నవ్వారు.

ఆ సజషన్ షాడోకి నచ్చింది. టీ వాసన తగలగానే ఆకలి జ్ఞాపకం వచ్చి పేగులు మెలికలు తిరుగుతున్నాయి.

కూర్చున్న చోటినుంచి ముందుకు వంగాడు.

మరుక్షణం నాలుగు మిషన్ గన్స్ అతని ముఖంలోకి తొంగిచూశాయి.

"మిస్టర్ షాడో! నీ గురించి మాకు బాగా తెలుసు. అందువల్ల... ఏ పని చేసినా నెమ్మదిగా.... మాకు నీ చేతుల కదలిక కనిపించేలా చేయటం చాలా మంచిది" కరుకుగా వినవచ్చింది హెచ్చరిక.

నెమ్మదిగా రొట్టెల ప్లేటును ముందుక లాక్కున్నాడు షాడో.

"నిలబడితే గాని కుదరదు.... కూర్చుని గట్టిగా పట్టుకోండి ఆ తుపాకుల్ని." ఒక రొట్టె విరిచి నోట్లో పెట్టుకుంటూ సలహా ఇచ్చాడు.

ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు వారందరూ. ఒక రొట్టె తిని టీ గ్లాసును అందుకున్నాడు షాడో.

టీ తాగి నెమ్మదిగా రొట్టెల్ని నమలసాగాడు.

పదినిముషాల తర్వాత ఆ వ్యక్తుల ఓపిక నశించింది. గొంతుకు కూర్చున్నారు ద్వారం ముందు

ఆఖరిరొట్టెను ఎడమచేతిలో పట్టుకొని... నెమ్మదిగా గోడకు అనుకున్నాడు షాడో నెమ్మదిగా గోడకు ప్రషర్ యిచ్చాడు.

ఉన్నట్లుండి కిందికి జారింది సీలింగ్. రెడీగా వున్న షాడో చటుక్కున బోర్లా పడుకున్నాడు. అదిరిపడి మిషన్ గన్స్‌ని ఎత్తబోయారు వారు.

సీలింగ్ ఏటవాలుగా కిందికి జారి వాళ్ళ తలమీద పడి, ఖంగుమని శబ్దం చేసింది.

మరుక్షణం మెరుపులా ముందుకు జరిగాడు షాడో. చేతికి అందిన మిషన్ గన్‌ని లాక్కుని ఒక వ్యక్తి పొట్టలో బలంగా పొడిచాడు.

కలకలం చెలరగింది గదిలో. అరనిముషంపాటు అంతా గజిబిజి–గందరగోళమై పోయింది.

అర నిముషం దాటిన ఆరుసెకండ్లకు అంతా పూర్తి అయిపోయింది. సీలింగ్‌ని పూర్తిగా కిందకిలాగి, స్పృహతప్పి పడిపోయిన నలుగురు ఆగంతకులను గదిలో పడుకో బెట్టి తలుపులు మూశాడు షాడో.

నలిగిపోయిన దుస్తుల్ని సవరించుకొని, మిషన్ గన్‌ని భుజంమీద పెట్టుకొని, ఎడమచేతిలో అలాగే వుండిపోయిన రొట్టెను నములుతూ తాపీగా ముందుకు ఆడుగులు వేశాడు

* * *

సూటిగా బిల్డింగ్ ముందున్న వరండాలోకి దారి తీసింది షాడో అనుసరిస్తున్న మార్గం.

వరండాలో గోడలకు అనుకొని నిలబడివున్న పాతిక మంది దృఢకాయుల్ని చూడగానే.... చటుక్కున్న వెనక్కి గెంతి దాక్కునే ప్రదేశం కొరకు అన్వేషించటం ప్రారంభించాడు షాడో.

ఆ ప్రదేశమంతా ట్యూబ్‌లైట్ల వెలుగుతో పట్టపగలులా వుంది. ఎవరికీ కనిపించకుండా నిలబడాలంటే – తిరిగి వచ్చిన మార్గానే యినుప గదికి పోక తప్పదని గ్రహించటానికి అతనికి ఎంతోసేపు పట్టలేదు.

వెనక్కి పోవటానికి మనస్కరించలేదు. ముందుకు వెళ్ళటానికి వీలులేదు. రెండు క్షణాలు ఆలోచించాడు.

"తప్పించుకున్నాడు.... షాడో తప్పించుకున్నాడు.... వెతకండి.... పట్టుకోండి..." ఒక గోడకు ఆనుకొని నిలబడి పెద్దగా అరిచాడు....

వరండాలో కలకలం వినవచ్చింది. పది మంది వ్యక్తులు ఒకేసారి షాడోకేసి వచ్చారు.

ముందుకు పరిగెత్తాడు షాడో. మిషన్ గన్‌ని గాలిలో ఊపుతూ.... "అడుగో అటుపోతున్నాడు.... పట్టుకోండి....పరిగెత్తండి...." అని ఆరుస్తూ వారి మధ్య నుంచి వరండాలోకి వచ్చాడు.

గొడవ ఆరంభమయింది. అందరూ షాడో పక్కన పరుగులు తీయటం మొదలు పెట్టారు.

ఆ హడావుడిలో షాడోని పరిశీలనగా చూడలేదెవరూ. చూసే వ్యవధి వారికి యివ్వలేదు షాడో. నాలుగు అంగల్లో వరండా మెట్లుదిగి బిల్డింగ్ ముందుకు పోయాడు. మనక చీకటిలోకి వెళ్ళగానే... నాలుగుసార్లు అటూ యిటూ పరిగెత్తి, ఒకరిద్దర్ని అదిలించి అవతలికి పంపి, కామ్‌గా పిట్టగోడను దూకి బిల్డింగ్‌కి ఎదురుగావున్న రోడ్ మీదికి పోయాడు.

అప్పటికి చేతిలోని రొట్టె మూడువంతులు అయిపోయింది. వంద గజాలదూరం పోగానే... తోక వూపుతూ ఎదురయింది ఒక చిన్న కుక్క పిల్ల. మిగిలిన రొట్టెముక్కను దాని ముందుకు విసిరి... కుడిచేతిలోని మిషన్ గన్‌ని పక్కనే కనిపించిన బురద గుంటలోకి గిరాటు వేశాడు.

వెనుకనుంచి అరుపులు వినవస్తున్నాయి.... భవనంలో వున్న వారందరూ రోడ్ మీదికి వచ్చేశారు. ఒకటి రెండు కార్లు స్టార్ట్ అయిన శబ్దం కూడా వినిపించింది.

తను ఏ ప్రదేశంలో వున్నాడో షాడోకు అర్థంకాలేదు. తను అనుసరిస్తున్న రోడ్ ఎటుపోతుందో అంతకన్నా తెలియలేదు. అలా అని తాత్సారం చేస్తూ

నిలబడితే మళ్ళీ యినప గదులలోకి వెళ్ళవలసి రావచ్చు, యీసారి ఓటి సీలింగ్‌లు కనిపించకపోవచ్చు.

రెండు కార్లు తనవైపే దూసుకు రావటం గమనించగానే చటుక్కున బురద గుంట మీదుగా జంప్ చేసి.... ఒక యింటి ఆవరణలోకి పోయాడు.

శరవేగంగా దూసుకుపోయాయి ఆ కార్లు అతన్ని గమనించలేదు. మళ్ళీ రోడ్ మీదికి వచ్చి మెల్లిగా లెఫ్ట్ రైట్ ప్రారంభించాడు షాడో.

అరమైలు దూరం నడిచిన తర్వాత ఒక చిన్న సెంటర్ ఎదురయింది. అప్పటికి షాడో రిస్ట్ వాచి తొమ్మిది గంటలు సూచిస్తోంది. సెంటర్‌లో వున్న దుకాణాలన్నీ మూసి వున్నాయి. దాదాపు నిర్మానుష్యంగా వున్నదా ప్రదేశం.

సిగిరెట్స్ అమ్మే దుకాణం కోసం వెతుకుతూ నడుస్తున్న షాడో... వున్నట్లుండి ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు.

ఒక టీ బంక్ చాటునుంచి అరుగురు వ్యక్తులు బయటికివచ్చి అతన్ని చుట్టు ముట్టారు.

“వెల్ మిస్టర్ షాడో.... నీ తెలివి మెచ్చుకో తగింది. కాని మాతో పోటీచేసి నెగ్గలేవు. నువ్వు ఇటు వస్తావని ముందే వూహించి నీ కోసం ఎదురు చూస్తున్నాం...” చేతిలోని రివాల్వార్‌ని షాడో తలకేసి గురిపెడుతూ అన్నాడొక వ్యక్తి.

మిషన్ గన్‌ని బురద గంటలో పడేసి రావటం తప్పయిపోయిందని గ్రహించాడు షాడో. మరోసారి నిరాయుధుడిగావున్న సమయంలో వల విసిరారు శత్రువులు.

మౌనంగా చేతులు గాలిలోకి ఎత్తి నిలబడ్డాడు.

"పోయి మన వాళ్ళని పిలుచుకురండి.... షాడో దొరికి పోయాడని చెప్పండి" ఆజ్ఞలు జారీ చేశాడు రివాల్వర్ పట్టుకున్న వ్యక్తి. అతని కంఠంలో ఆనందం తొణికిసలాడుతున్నది.

ఇద్దరు వ్యక్తులు సెంటర్‌కి అటూ యిటూ వున్న రోడ్ల మీదికి పరుగుతీశారు. నలుగురు మిగిలారు షాడో ముందు.

వారికి తనకు వున్న మధ్య దూరాన్ని కనులతో అంచనా వేశాడు షాడో. చిన్న అవకాశం.... ఎ లిటిల్ బిట్ ఆఫ్ ఎ డైవర్షన్.... లభిస్తే చాలు! అందుకు అవకాశం లేదని కనిపిస్తూనే వుంది. ఏ మాత్రం కదిలినా.... కాళ్ళు చేతులు బుల్లెట్లతో నిండిపోయేటట్లున్నాయి.

"నిజంగా... ఇంత తేలికగా మాకు చిక్కిపోతావని అనుకోలేదు మిస్టర్ షాడో.... కంటికి కనిపించని శక్తులేవో నిన్ను ప్రమాదాలనుంచి రక్షిస్తూ వుంటాయని అనుకుంటారు అందరూ. ఏవి ఆ శక్తులు? ఇప్పుడు వచ్చి నిన్ను రక్షించమను చూద్దాం!?" వికృతంగా నవ్వుతూ రివాల్వర్‌తో షాడో ముక్కు మీద పొడిచాడు ఆజ్ఞలు జారీచేసిన దృఢకాయుడు.

అదే సమయంలో షాడో వెనుక నుంచి గుర్రుమన్న శబ్దం వినవచ్చింది. బాణంలా ముందుకు దూకి ఆ వ్యక్తి కాలును కరిచి పట్టుకంది ఒక కుక్క పిల్ల.

అదిరిపోయి వెనక్కి గెంతాడా దృఢకాయుడు.

ఆ వ్యవధి షాడోకు చాలు... మెరుపుకంటె వేగంగా కదిలాయి అతని చేతులు. పాంటుకు వున్న బెల్టును వూడలాగుతూ ముందుకు దూకాడు.

నిశబ్దంగావున్న ఆ నాలుగు వీధుల కూడలి.... కొరడాలా చళ్ ఛళ్ మని శబ్దం చేస్తున్న బెల్టుమోతలతో నిండిపోయింది.

షాడోని కార్నర్ చేసిన నలుగురూ..... ఆయుధాలు ఎగిరిపోగా.. బెల్టు దెబ్బలనుంచి తప్పించుకోవటానికి నాలుగు పక్కలకూ పారిపోయారు.

వారందర్నీ ఒకేసారి తరమాలని భయంకరంగా అరుస్తూ ఎగిరి గంతులు వేస్తూ రౌండ్లు కొడుతున్నది – ఆ కుక్కపిల్ల.

ఆ పైన అక్కడ ఆగదలుచుకోలేదు షాడో. బెల్టును చేతి చుట్టూ చుట్టుకొనికనిపించిన పరుగు ఆందుకున్నాడు.

అతి సీరియస్‌గా అతన్ని అనుసరించటం ప్రారంభించింది ఆ కుక్క పిల్ల.

* * *

'ఫతేపూర్' అన్న బోర్డు కనిపించగానే షాడో కాళ్ళకు బ్రేకులు పడ్డాయి.

ఉర్దూలో వ్రాయబడిన ఆ అక్షరాలు..... అతన్ని వెక్కిరిస్తున్నట్లు మెరిసిపోతున్నాయి – మీద పడుతున్న నియోన్ లైటు వెలుగులో.

ఫతేపూర్! కరాచీకి రెండు వందలమైళ్ళ దూరంలో వున్న ఒక బోర్డర్ సిటీ భారతదేశానికి సరిగ్గా వందమైళ్ళ దూరంలో వున్నదది.

ఢిల్లీ నుంచి తనను స్మగుల్ చేసి బోర్డర్లు దాటించిన శత్రువుల చాకచక్యానికి విస్తుబోయాడు షాడో.

అంతవరకూ తను భారతదేశంలోనే వున్ననని అనుకుంటున్నాడు. ఇప్పుడు మరో సమస్య ఎదురయింది. వెంటపడుతున్న వారిని తప్పించుకుంటూ తను బోర్డర్లు దాటాలి.

షాడో చేయి పాంటు జేబుమీదికి పోయింది. ఏముంది జేబులో? వాలెట్ ఆ దుర్మార్గుల చేతులకు చిక్కింది. ఒక వేళ వాలెట్ ఆ దుర్మార్గుల చేతులకు చిక్కింది. ఒక వేళ వాలెట్ జేబులోనే వున్నా – అందులో ఇండియన్ కరెన్సీ వుంటుంది. అది పాకిస్థాన్‌లో నాలుక గీచుకోవటానికి పనికిరాదు.

చేతిలో చిల్లి కానీ లేకుండా తను ఏం చేయలడు?

అప్పుడే ఏదో ట్రైన్ ప్లాట్‌ఫాం మీదికి వచ్చి నిలబడింది. కరాచీ వైపు పోతున్నదది. అందులో ప్రయాణించి కరాచీ చేరుకుంటే! ప్రస్తుత పరిస్థితులలో తను బోర్డర్స్‌కి దూరంగా పోకూడదు. ఎంత త్వరగా పాకిస్థాన్‌లో నుంచి బయటపడితే అంత మంచిది.

లాహోర్‌కి పోయే ట్రైన్స్ వున్నాయేమో తెలుసుకొని..... లాహోర్ నుంచి బోర్డర్ దగ్గిరికి పోయి.... అక్కడి నుంచి –

అప్పుడే ఒక నీలం రంగు దండర్ బర్డ్ కారు రైల్వేస్టేషన్ ముందుకు వచ్చి నిలబడింది.

పాతిక సంవత్సరాల వయస్సున్న యువత కిందికి దిగి చుట్టూ చూడటం ప్రారంభించింది. స్టీరింగ్ ముందు ఒక మధ్య వయస్కుడున్నాడు. అతను కారు దిగలేదు. రెండు నిముషాల తరువాత యువతిని దగ్గిరికి పిలిచి ఏదో చెప్పాడు.

ఆమె పక్కకు తిరిగి మున్సిపాలిటీ డంపింగ్స్ వైపు చూసింది. ఒక డస్ట్ బిన్ చాటున కూర్చుని వున్నాడుషాడో. ఆమె తన వైపు చూడగానే వులిక్కి పడ్డాడు.

ఆ పైన అక్కడ వుండలేక పోయాడు. చల్లగా వెనక్కు జరిగి స్టేషన్‌కి వందగజాల దూరంలో ఫెన్సింగ్‌ని క్రాస్ చేసి రైల్వే ట్రాక్స్ మీదికి వెళ్ళాడు.

కరాచీపోయే ట్రైన్ పెద్దగా కూతపెట్టి కదిలింది. థండర్ బర్డ్ దగ్గిరి యువతి ప్లాట్‌ఫాం వైపు పరుగెత్తుకు రావటం షాడోకి కనిపించింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా పక్కనుంచి పోతున్న కంపార్ట్‌మెంట్ వూచ నొకదాన్ని పట్టుకున్నాడు.

ఒక కాలును తలుపుకింది మెట్టుమీదవేసి రెండవ కాలును ఎత్తబోతుండగా పాంటును కరిచి పట్టుకొని జాలిగా మూలిగింది కుక్కపిల్ల.

అప్పుడు దాన్ని గమనించాడు షాడో. మొట్ట మొదటి సారిగా అతని ఆలోచల్లోకి ఆ కుక్కపిల్ల ప్రవేశించింది.

బెత్తెడుకూడా లేని ఎంగిలి రొట్టెముక్క వేసినందుకు. ప్రతిఫలంగా ప్రాణాలు కాపాడిందా విశ్వాసానికి ప్రతిరూపమైన చిన్న ప్రాణం!

ట్రైన్ స్పీడ్ అందుకుంది. పాంటును వదిలి పెట్టకుండా, కరిచి పట్టుకోని వేలాడబడింది కుక్కపిల్ల.

మెల్లిగా కాలును పైకి ఎత్తాడు షాడో ఎడమచేత్తో దాన్ని అందుకొని కంపార్ట్‌మెంట్ లోకి తోశాడు.

తోక ఆడిస్తూ సంతోంగా ఆరుస్తూ ఎగిరి గంతులు వేసిందది. తను కూడా కంపార్ట్‌మెంట్ లోకి అడుగు పెట్టాడు షాడో.

ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ అది. ఇద్దరే ప్రయాణిస్తున్నారందులో. నలభై సంవత్సరాల మధ్య వయస్కుడు, ఒక ముప్పై సంవత్సరాల స్త్రీ బహుశా భార్యాభర్తలు కాకపోవచ్చు – ద్వారం దగ్గిర అలికిడి వినగానే వులిక్కిపడి ఒకరి కొకరు దూరం జరిగి కూర్చున్నారు.

“వాటీజ్ దిస్ నాన్సెన్స్? ఇది ఫస్ట్ క్లాస్ అని తెలియదా? దిగిపోతావా? చైన్ లాగి రైలును ఆపు చేయమంటావా?” షాడోని, కుక్కపిల్లను చూడగానే మండి పడ్డాడా మధ్య వయస్కుడు.

“మన్నించాలి సర్.... తెలియక ఎక్కాను. వచ్చే స్టేషన్‌లో దిగిపోతాను. నావల్ల మీ ఏకాంతానికి ఎటువంటి విఘ్నమూ రాదు... ” తలుపు దగ్గిర ఒదిగి నిలబడి వినయంగా సమాధానం యిచ్చాడు షాడో.

“తెలియక ఎక్కావా? యూ బ్లడీ రోగ్. టిక్కట్లు లేకుండా ప్రయాణం చేసే నీలాంటి వాళ్ళని కాల్చిచంపాలి..... ముందు దిగి పోతావా లేదా?” షాడో వినయంగా

సమాధానం యిచ్చేసరికి ఆ పెద్దమనిషి మరింత ఎగిరి పడ్డాడు.

మౌనంగా నిలబడ్డాడు షాడో. అంతటితో ఆగలేదా మధ్య వయస్కుడు. పిడికిళ్ళు బిగించి షాడో మీదికి వచ్చాడు.

ట్రైన్ స్పీడుగా పోతున్నది. పక్క కంపార్ట్‌మెంట్ లోకి పోవాలంటే కొంచెం రిస్క్ తీసుకోక తప్పదు.

ఆ వ్యక్తి ప్రవర్తనకు షాడో కోపగించుకోలేదు. పాపం.... ఏదో తిప్పలు పడుతున్నాడు..... తను పానకంలో పుడకలా ప్రవేశించి అంతరాయం కల్పించటం జరిగింది.

“దిగి పోతావా, లేదా?” అంటూ షాడో మెడ మీద చెయ్యివేశాడు ఆ వ్యక్తి.

మరుక్షణం గంయ్ మంటూ లేచింది కుక్కపిల్ల. ఎగిరి అతని పాంటును పట్టుకుంది.

పెద్దగా అరిచి దాన్ని విదిలించి కొట్టాడతను, పక్కకు పరుగెత్తి చైన్ మీద చెయ్యివేశాడు.

అంతటితో షాడో సహనం అంతరిచింది. రెండు అంగల్లో అతన్ని సమీపించి మెడమీద చరిచాడు బలంగా. చాప చుట్టలా పడిపోతున్న ఆకారాన్ని జాగ్రత్తగా సీటుమీద పడుకోబెట్టి....ఆ స్త్రీ వైపు తిరిగాడు.

"చూడమ్మా.... కరాచీ పోవాలి నేను, అంతవరకూ యీ మన్మధుడు యిలాగే కామ్‌గా వుండి తీరాలి. ఏమాత్రం గొడవచేసినా రైల్లోనుంచి కిందికి దొర్లిస్తాను" అని హెచ్చరించి సీటుమీద కూర్చున్నాడు.

బెదురు చూపులతో తల వూపిందామె. ఆ మధ్య వయస్కుడి జేబులో సిగిరెట్ పాకెట్ కనిపించి షాడో ప్రాణం లేచి వచ్చింది.

"ఒక సిగిరెట్ తీసుకోవచ్చా?" అని అడిగాడా స్త్రీని. అర్థం కానట్లు అయోమయంగా చూసిందామె. కామ్‌గా సిగిరెట్ తీసుకొని వెలిగించుకున్నాడు షాడో.

తిరిగి ప్రపంచం అనందమయం అయింది. తెల్లవారే సరికి కరాచీ చేరుకుంటాడు తను. సిమ్లా ఎగ్రిమెంట్ ధర్మమా అని ఓడ వ్యాపారం ప్రారంభమయింది భారత, పాకిస్థాన్‌ల మధ్య. ఏదో ఒక ఓడలో ప్రవేశం సంపాదించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి వెళ్ళి పోవచ్చు.

అంతవరకూ నిర్మలంగావున్న ఆకాశం క్షణంలో కారు మబ్బులతో నిండిపోయింది. చల్లటిగాలి.... చినుకులు.... ఉరుములు– మెరుపులు మొదలైనాయి.

మరీ మంచిది. "వర్షంలో తనవెంటపడే పిచ్చివాళ్ళు ఎవరూలేరు'" కిటికీ తలుపులు కిందికి దించుతూ అనుకున్నాడు షాడో.

ఫతేపూర్ మీదుగా కరాచీపోయే ట్రంక్ రోడ్ రైల్వే పట్టాలకు పక్కగానే వుంది.

దానిమీద ట్రైన్‌ని అనుసరించి వస్తున్న థండర్ బర్డ్ మాత్రం షాడోకి కనిపించలేదు. కనిపించి వుంటే అతని ఆలోచనలు మరో విధంగా వుండివుండేవి.

* * *

ట్రైన్ కరాచీ చేరుకునేసరికి సాయంత్రం ఆరుగంటలు అయింది. వర్షం ఆగలేదు.చినికి చినికి దాబుణమైన గాలి వానగా మారింది. మబ్బులు దట్టంగా కమ్మకొని వుండటంవల్ల చీకటి పడినట్లు అనిపిస్తోంది.

వర్షానికి బెదిరిన కరాచీ పౌరులు చాలా మంది రైల్వే స్టేషన్‌లో తల దాచుకున్నారు. ఆ రష్‌లో పాసింజర్స్ వద్ద టిక్కట్లు సరిగా వసూలు చేయక పోతున్నారు టిక్కట్ కలెక్టర్లు.

అదును చూసుకొని స్టేషన్ నుంచి బయటపడ్డాడు షాడో కుక్కపిల్లను చంకలో పెట్టుకొని స్టేషన్‌కి పక్కగా వున్న చిన్న సందులో అడుగులు వేయటం ప్రారంభించాడు.

చలిగాలి ఎముకలను విరుచుకు తింటోంది. వర్షం మూలంగా కాళ్ళు చేతులు బిగుసుకు పోతున్నాయి. తిండి తిప్పలు లేకుండా ప్రయాణం సాగించటంవల్ల ఆకలి పేగులను నలుచుకు తింటున్నది.

కరాచీ హార్బర్ అక్కడికి పదిమైళ్ళ దూరంలో వుంది. హార్బర్ దగ్గిరికి వెళ్ళి మిగిలిన విషయాలు ఆలోచించుకో వచ్చని ఎక్కడా ఆగకుండా తల వంచుకొని చకచకా అడుగులు వేస్తున్నాడు షాడో.

స్టేషన్ని వదిలి అరమైలు దూరం కూడా పోకముందే మరోసారి శత్రు వలయంలో చిక్కుపడి పోయాడు.

ఫతేపూర్ నుంచి అనుసరిస్తూనే వున్నారు వారు, అదునుచూసి చుట్టుముట్టారు. షాడో వెనుక వందగజాల దూరంలో గుంపుకట్టి అనుసరించటం ప్రారంభించారు.

వాళ్ళకి స్లిప్ యిచ్చేటందుకు అనువైన ప్రదేశంకోసం వెతుకుతూ వేగంగా అడుగులు వేయసాగాడు షాడో.

ముందు వందగజాల దూరంలో మరో సందు కనిపించింది. అటుపోదామని అనుకుంటుండగా... ఆ సందులో నుంచి పదిమంది దృఢకాయులు రోడ్ మీదికి వచ్చారు.

వెనుక వస్తున్నవారు అడుగుల వేగం హెచ్చించారు.

అడకత్తెరలో చిక్కుపడ్డాడు షాడో. రోడ్ మీద నడవక పోయినా.... గోడల చాటున దుకాణాలముందు నిలబడి వున్నారు అనేక మంది కరాచీ పౌరులు.

వారందరూ చూస్తూ వుండగా ఆయుధాలు వుపయోగించరు శత్రువులు. కాని చితక కొట్టి మోసుకు పోవచ్చు. ఏదో రౌడీల గలాటా అని అంతగా పట్టించుకోరు ఎవరూ.

కుక్కపిల్లను ఎడమ చంకలోకి మార్చుకొని పాంటుకున్న బెల్టును వూడలాగాడు షాడో.

అది గమనించారు ముందు వస్తున్న వారు. చేతులకున్న గ్లవ్స్ తొలగించి వాటి స్థానాల్లో మూరెడు పొడుగున్న లావాటి యినుప చువ్వలను ప్రదర్శించారు.

వెనుక వస్తున్న వారు పాతిక అడుగుల దూరంలోకి వచ్చేశారు. "పట్టుకోండి – ఈ సారయినా వళ్ళు దగ్గర పెట్టుకోని వ్యవహరించండి –" అన్న మాటలు షాడో చెవులకు చేరాయి.

బెల్టును గట్టిగా పట్టుకొని ఎదురు తిరగటానికే నిశ్చయించుకున్నాడు షాడో. నలుగురైదుగుర్ని పడగొట్టి పారి పోవాలని అతని ఆలోచన.

అదే సమయంలో చెవులు గింగిర్లు ఎత్తేలా హారన్ మోగిస్తూ. అతి వేగంగా అక్కడికి దూసుకు వచ్చింది ఒక కారు.

రోడ్ మీది జనం... ఖంగారుగా పక్కలకు దూకారు, సూటిగా షాడో పక్కకు వచ్చి సడన్ బ్రేక్‌తో ఆగిందది – ధండర్ బర్డ్ కారు.

వెనుక తలుపు తెరుచుకుంది. "మిస్టర్ షాడో.... క్విక్... త్వరగా లోపలకు రండి...." అదుర్దాగా హెచ్చరించింది ఒక ఆడ కంఠం.

రెండో ఆలోచన లేకుండా లోపలికి దూకాడు షాడో. తలుపు ధన్ మని మూశాడు. మరుక్షణం ముందుకు దూకింది ధండర్ బర్డ్.

అడ్డు రావటానికి ప్రయత్నించారు ముందున్న వ్యక్తులు, గంటకు నూటయాభై మైళ్ళ స్పీడుతో బయలు దేరిందాకారు. వారికి ధైర్యం చాలలేదు.

పక్కలకు గెంతారు. ఇద్దరు వ్యక్తులు డోరు బంపర్ తగిలి ఎగిరి దూరంగా పడిపోయారు.

అంతటితో శత్రువుల సహనం అంతరించింది. వారి జేబుల్లో వున్న రివాల్వర్లు బయటికి వచ్చి దాఋణంగా గర్జించటం ప్రారంభించాయి.

ధండర్ బర్డ్ వెనుక అద్దాలు ముక్కలుముక్కలై పోయాయి. అయినా లక్ష్యం పెట్టలేదు దాన్ని నడుపుతున్న మధ్య వయస్కుడు. యాక్సిలేటర్‌ని మరింత గట్టిగా నొక్కి.... "డోన్ట్ వర్రీ మిస్టర్ షాడో – ఈ చిచోరీ గాళ్ళకు మనం చిక్కం – క్షణంలో వెళ్ళిపోతాం" అంటూ అతి వేగంగా ఆ ప్రదేశం నుంచి దూరంగా తీసుకు పోయాడు.

* * *

"మిస్టర్ షాడో – ఇంకో పదినిముషాల్లో మనం యీ కారును వదిలి మరో వెహికల్‌ని కాచ్ చేస్తాం.... అందుకు ముందు నువ్వు కొద్దిగా వేషం మార్చుకోవటం మంచిది"

అంటూ ఒక బ్రీఫ్ కేస్‌ని అందించినా యువతి.

ఆమెను గుర్తించాడు షాడో. డ్రయివర్‌ని గుర్తుపట్టాడు.

"మీరెవరు? నన్నెందుకు వెంటాడుతున్నారు?" అని ప్రశ్నించాడు – బెల్ట్‌ని రెడీగా పట్టుకుంటూ.

నవ్వింది యువతి. ఆమె కళ్ళు వింతగా ప్రకాశించాయి. జవాబు యివ్వకుండా బ్రీఫ్ కేస్‌ని తెరిచింది. అందులో నీలం రంగు ఓవర్ కోటు ఒకటి వుంది. దానిమీద నీట్‌గా పాక్ చేయబడిన గిరిజాల విగ్గు, గడ్డం వున్నాయి.

"మిస్టర్ షాడో! నీకోసం పాకిస్థాన్ సీక్రెట్ ఏజన్సీ వాళ్ళు వెదుకుతున్నారు. కరాచీ లోకల్ పోలీస్ బ్లాకేడ్స్ సిద్ధంచేసి సోదా ప్రారంభించారు. ముందు వేషం మార్చుకో. నెమ్మదిగా నీకే అర్థం అవుతాయి అన్ని విషయాలు" అన్నది మృదువుగా.

"హఁ హఁ షాడో భయ్యా... దౌలత్ చెప్పినట్లు చేయటం మంచిది. మేము నీకు శత్రువులం కాదు" వెంటనే అందుకున్నాడు స్టీరింగ్ ముందున్న మధ్య వయస్కుడు.

వారి మాటలు షాడోకి అర్థం కాలేదు. ఏదీ ఏమయినా వాళ్ళు తన్ను ఒక టైట్ స్పాట్‌లో నుంచి రక్షించారు, వారి మాటల ప్రకారమే నడుచుకొని – ఏమౌతుందో చూసి నందువల్ల వచ్చే నష్టం కూడా ఏమీలేదు.

ఓవర్ కోటు ధరించి విగ్గు పెట్టుకున్నాడు. గడ్డాన్ని గట్టిగా బిగించుకొని ముందున్న రియర్ వ్యూ మిర్రర్‌లో ముఖం చూసుకున్నాడు.

ముఖం పూర్తిగా మారి పోయింది. దగ్గరికి వచ్చి జాగ్రత్తగా పరిశీలిస్తేగాని అవి విగ్గు – పెట్టుడు గడ్డం అని తెలిదు.

ఒక సందులోకి ప్రవేశించి సడన్ బ్రేక్‌తో ఆగింది ధండర్ బర్డ్ వెంటనే ముందుకు ఆవతలి వైపున్న వున్న ఫోర్డ్ కారొకటి కదిలి అక్కడికి వచ్చింది.

ధండర్ బర్డ్‌ని వదిలి దాన్ని అధివసించారు ముగ్గురూ, అదే సందులో ప్రయాణించి పది నిముషాల తరువాత ఒక మెయిన్ రోడ్ మీదకి వెళ్ళారు. పోలీసులు ఆ రోడ్ మీద కాపలా వున్నారు.

రోడ్‌కు అడ్డంగా నిలబడిన పోలీసు అధికారులు యిద్దరు ఫోర్డును అపమని సైగచేసి కారు పక్కకువచ్చారు.

వారి వంక చూసి గుర్రుమన బోయిన కుక్కపిల్లను కాళ్ళ కింద నొక్కి పట్టి – సూటిగా ముందుకే చూస్తూ కూర్చున్నాను షాడో.

ఒక ఫోటోను కారులోపలికి జాచాడు పోలీసు అధికారి ఒకడు. “ఈ వ్యక్తిని మీరు చూశారా ఎక్కడైనా” అన్నాడు వుర్దూలో.

పెదవి విరిచిందా యువతి.

తన ఫోటోని గుర్తించాడు షాడో. అది సీక్రెట్ ఏజంట్‌గా మారిన తర్వాత తీసింది కాదు. దొంగగా సంచరిస్తున్న సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఫోటో!

తనకు కూడా తెలియదని తల అడ్డం తిప్పాడు.

రెండవ ఆఫీసర్ మౌనంగా నిలబడి.... కారును సునిశితంగా పరిశీలిస్తున్నాడు.

రెండు నిముషాలు అక్కడే నిలబెట్టి పక్కకు తొలిగారు వారు.

“థేంక్ గాడ్! ఒక గండం గడిచింది” అనుకుంటూ ఫోర్డ్‌ని ముందుకు దూకించాడు మధ్య వయస్కుడు.

గండం ఎవరికి గడిచిందో షాడోకి అర్ధం కాలేదు. పాకిస్థాన్ లో తన బాగు కోరే వాళ్ళు ఎవరున్నారు?

అరగంట తర్వాత కరాచీకి కొంచెం యివతలగా..... రోడ్‌కు కొంచెం అవతలగా వున్న పెద్ద పురాతన బంగ్లా ముందు ఆగింది పోర్టు కారు.

“మిస్టర్ షాడో! వెల్‌కమ్ టూ అవర్ హెడ్‌క్వార్టర్స్! నీ అనుమానాలన్నిటికీ సమాధానాలు యింకో గంట తర్వాత తెలిసి వస్తాయి” అంటూ షాడో చేయి పట్టుకొని లోపలికి తీసుకు పోయింది ఆ యువతి.

కుక్క పిల్లను చంకలో పెట్టుకొని అనుసరించాడు షాడో.

ఒక గదిలో వున్న ఫేం కుర్చీలో కూర్చోపెట్టి..... మరో గదిలోకి వెళ్ళింది ఆమె. మరుక్షణం తలుపులు మూసుకున్నాయి.

ఒక్క గంతులో లేచాడు షాడో. తలుపులు బయటి వైపు గడియ పెట్టడ్డాయి. తను వచ్చిన దిశలో వున్న ద్వారాన్ని పరిశీలించాడు. అదీ అంతే.

మాటల్లో పెట్టి అతి తెలివిగా బంధించిందా యువతి.

షాడో పిడికళ్ళు బిగుసుకున్నాయి, పళ్ళు కొరుకుతూ చుట్టూ చూశాడు. అదే సమయంలో ఆ గది పైభాగంలో నుంచి గంభీరమైన నువ్వు ఒకటి వినిపించింది.

తల పైకి ఎత్తాడు షాడో.

సీలింగ్ మీద చిన్న లౌడ్ స్పీకర్ అమర్చబడి వుంది. దాని పక్కన కెమేరా లాంటి సాధనలు ఒకటి వుంది.

దాని ద్వారా గదిలోవున్న షాడోని ఎవరో బయటినుంచి పరికిస్తున్నారు. వారి నవ్వుల్ని ఆ లౌడ్ స్పీకర్ షాడోకి వినిపిస్తోంది.

షాడో కోపం మరో రెండు మెట్లు పైకి ఎక్కింది.

“ఎవరు మీరు? నన్నెందుకు బంధించారు?” అన్నాడు కెమేరా వంకే చూస్తూ.

మరోసారి వినవచ్చిందా గంభీరమైన నవ్వు.

"మిస్టర్ షాడో! వెల్‌కమ్ టూ కరాచీ.... ఇంతవరకూ నువ్వు పడిన బాధలకు మా సానుభూతి –"

అతని మాటలు పూర్తికాక ముందే గది మధ్య వున్న ఛైర్‌ని కెమేరా కిందికి లాగి దానిమీద నిలబడ్డాడు షాడో. చేతిలో వున్న బెల్టును రెండవ కొసవైపు పట్టుకొని బకిల్ వున్న కొసను గాలిలో వూపాడు.

"మీ సానుభూతి నాకు అనవసరం. మీరు చేసిన సాయానికి నా కృతజ్ఞతలు తెలియ చేసుకుంటున్నాను. మర్యాదగా పదిక్షణాల్లో తలుపులు తెరవండి. లేకపోతే ఆ తర్వాత జరిగే విషయాలకు బాధ్యుణ్ని నేను కాదు" అన్నాడు.

రెండు క్షణాలు మౌనం రాజ్యం చేసింది..... "కోపం వద్దు మిస్టర్ షాడో. దౌలత్ నిన్ను గురించి రిపోర్టు చేయటం ఫినిష్ చేయగానే అన్ని విషయాలు క్లియర్ అవుతాయి. అంతవరకు ఓపిక పట్టు."

"ఓపిక పట్టాలా? ఓపిక" కోపంతో పళ్ళు కొరుకుతూ బెల్టును పైకి విసిరాడు షాడో.

బెల్టు బకిల్ కెమేరా అద్దానికి తగిలింది. ఫట్ మన్న శబ్దంతో అది పగిలి పోయింది. కెమేరా పనిచెయ్యటం మానేసింది.

"మిస్టర్ షాడో – ఇది చాలా దారుణం....." ఖంగారుగా వినిపించింది మైకులో నుంచి.

"నేను కనిపిస్తున్నానా?" కామ్‌గా అడిగాడు షాడో

“ఎలా? కెమేరా పాడైపోయింది.... పదివేల రూపాయల కెమేరా అది...” ఆందోళనగా అన్నదో కంఠం.

బెల్టుతో లౌడ్ స్పికర్ మీద మృదువుగా కొట్టాడు షాడో. “పది క్షణాల్లో, తలుపులు తెరుచుకోక పోతే ఈ భవనాన్ని గూడా పాడు చేస్తాను” అన్నాడు గట్టిగా.

“మిస్టర్ షాడో! ఎందుకులే అని వూరుకున్న కొద్దీ నీ బెదిరింపులు మీరుతున్నాయి. అందుకు తగిన ప్రతిఫలం అనుభవిస్తావ్” కోపంగా అన్నదా కంఠం.

వెంటనే బెల్టును బలంగా విసిరాడు షాడో లౌడ్ స్పీకర్ పగిలిపోయి కిందపడింది.

వెంటనే కుర్చీని ఎత్తి ఒక తలుపుకేసి విసిరాడు తలుపులు కొద్దిగా చలించాయి. కుర్చీ విరిగిపోయింది.

అంతవరకూ కామ్‌గా కూర్చున్న కుక్కపిల్ల పెద్దగా అరవటం ప్రారంభించింది.

కుర్చీని ఎత్తి నేలకేసి కొట్టాడు షాడో మరోసారి. దాని కాలును వూడపీకి లాటీలా పట్టుకున్నాడు. గది చివరకి పోయి వేగంగా పరుగుతీసి భుజంతో తలుపును గుద్దాడు.

భళ్ళున తెరచుకున్నాయి తలుపులు తల్లక్రిందులుగా బయటపడ్డాడు షాడో. అప్పుడే అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఖంగారుగా రివాల్వర్లు ఎత్తారు.

గంయ్ మని అరుస్తూ వారిమీద కలబడింది కుక్క పిల్ల. వారిదృష్టి క్షణకాలం దానిమీద వుండిపోయింది.

నేలకు కొట్టబడిన బంతిలా లేచాడు షాడో. లేస్తూనే చేతిలోని కుర్చీ కొయ్యతో ఒక వ్యక్తి మెడ మీద చరిచి పరుగు అందుకున్నాడు. పక్క గదిలోనే కనిపించింది దౌలత్.

ఎవరికో ఫోన్ చేస్తోంది. హడావుడిగా ఆమెను విసురుగా పక్కకుతోసి టెలీఫోన్‌ని ఒక్క దెబ్బతో ముక్కలు ముక్కలు చేశాడు షాడో.

“కమాన్ మై ఫ్రండ్.... కమాన్?” అని కుక్కపిల్లను పిలుస్తూ బయటికి పరుగుతీశాడు.

“షాడో! మిస్టర్ షాడో!!” అని అరుస్తున్నది దౌలత్. వినిపించుకో దలచలేదు షాడో. ఆగకుండా ముందు వరండాలోకి వచ్చాడు.

ముఖద్వారాలు మూసి వున్నాయి. వాటికి అడ్డంగా కారును డ్రయిప్ చేసిన మధ్య వయస్కుడు నిలబడి వున్నాడు.

అతని చేతిలో ఏనుగుల్ని వేటాడటానికి వుపయోగించే పెద్ద షాట్ గన్ ఒకటి వుంది.

* * *

“తొందరపడకు మిస్టర్ షాడో! బయట నీ కోసం చాలామంది కాపలా కాస్తున్నారు. ధండర్ బర్డ్‌లో మనం టోకరా యిచ్చివచ్చిన బృందం అది. ఆవేశంతో వెనుకా ముందూ చూసుకోకుండా పోయి.... ఆ తర్వాత విచారించటం వల్ల ప్రయోజనం వుండదు” అన్నాడా మధ్య వయస్కుడు కామ్‌గా.

అతనికి ఐదు అడుగుల దూరంలో నిలబడ్డాడు షాడో

"బయట నాకోసం ఎవరు కాపలా వున్నా సరే... నేను వెళ్ళి తీరాల నన్ను ఆపదలుచుకుంటే షాట్ గన్‌ని వుపయోగించు. లేకపోతే దారికి అడ్డు తొలుగు. పదిక్షణాలలో ఏదో ఒకటి జరిగిపోవాలి" అన్నాడు మడిచి పెట్టిన ఇనుప స్ప్రింగులా రెడీ అవుతూ.

"మిస్టర్ షాడో.... దయచేసి కొంచెం నిదానించు. పాకిస్థాన్‌లో విచ్చలవిడిగా సంచరిస్తూ అక్రమాలను కోసం సాగిస్తోంది ఒక క్రిమినల్ గాంగ్. దాని చర్యలను అడ్డుకోవటం ఎవరికీ సాధ్యపడటం లేదు. అదృష్టవశాత్తు ఆ గాంగ్ నిన్ను బంధించి తీసుకురావాలని నిర్ణయించడం మాకు తెలిసింది. ఆ గాంగ్‌ని ఎదిరించగలిగిన వాడిని నువ్వేనని మాకు నమ్మకం చిక్కింది. గాంగ్ చేతుల్లో నుంచి నిన్ను విడిపించాలని ప్లాను వేస్తుండగా నువ్వే తప్పించుకున్నావు. మిస్టర్ షాడో.... మాకు సాయం చేస్తానని నిన్ను రక్షించటం జరిగింది" మెల్లగా అన్నాడు మధ్య వయస్కుడు.

చిన్నగా నవ్వాడు షాడో. "మీరెవరు? పోలీసులా?" అని ప్రశ్నించాడు. కాదని తల అడ్డం తిప్పాడతను.

"పాకిస్థాన్ ఏజంట్లా?"

"కాదు."

"అయితే మరి మీరెవరు?"

"మిస్టర్ షాడో! ప్లీజ్... దయచేసి ఆ వివరాలు నన్నడగవద్దు. అని మీకు చెప్పవలసిన వాళ్ళు చెప్తారు."

“అయితే వాళ్ళెవరో.... పోయి యీ విషయం చెప్పు – షాడో అద్దెలకు తిరిగే మెషీన్ కాదు. ఒక్క సి.ఐ.బి.ఆజ్ఞలకు తప్ప మరో ఏజెన్సీమాటలకు విలువ యివ్వటం నాకు అలవాటులేదు. మీ పాకిస్థాన్ నా దేశపు బాగును కాంక్షించే దేశమైతే... మీరు అడగకుండానే నా ప్రభుత్వం యిక్కడి అక్రమాలను ఎదుర్కోమని నన్ను అదేశించి వుండేది. మీరు చేస్తున్న పాపాలకు ప్రతిఫలంగా దేవుడు ఈ గాంగ్‌ని క్రియేట్ చేసి మీ దేశంలో వదిలాడు. అనుభవించండి” అంటూ అతన్ని పక్కకుతోసి తలుపులు తెరిచాడు.

మధ్య వయస్కుడి మాటలు నిజమని వెంటనే తెలిసింది. రోడ్డుమీద నిలబడి వున్నాయి నాలుగు కార్లు.

వెంటనే వెనక్కి జరిగి తలుపులు మూశాడు షాడో.

“చూశావా..... నా మాటలమీద నమ్మకం కుదిరిందా?”అడిగాడా మధ్య వయస్కుడు, అతనివంక ఒకసారి సీరియస్‌గా చూసి.... మళ్ళీ లోపలికి దారితీశాడు షాడో.

ఈ సారి జాగ్రత్తగా దారి చూసుకొని భవనం వెనుక భాగానికి పోయాడు.

ఎవరూ అతన్ని ఆపటానికి ప్రయత్నించలేదు.

వెనుక ద్వారం వున్న గదిలోని లైటును ఆర్పి తలుపులు ఓరగా తెరచాడు షాడో. కళ్ళు చీకటికి అలవాటు పడేదాకా ఆగి మెల్లగా బయటకు అడుగుపెట్టాడు.

అక్కడినుంచి ఎటు పోవాలన్నా.... రోడ్డుమీదికి వెళ్ళక తప్పదు. అది గమనించే రోడ్డుమీద కాపలా కాశారు శత్రువులు.

నీడలా నిశబ్దంగా అడుగులువేస్తూ.... వంటరిగా ఒక చివర నిలబడివున్న ఆకారాన్ని సమీపించాడు షాడో.

రెండు నిముషాలపాటు అతన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. వంటరిగా నిలబడి వుండటం ఆ వ్యక్తికి చాలా బాధగా వుంది కాబోలు... తనలో తను గొణుక్కుంటూ ... సిగిరెట్ పాకెట్ బయటికి తీశాడు.

మరుక్షణం తీవిగా అడుగులువేస్తూ అతన్ని సమీపించాడు షాడో.

"యూ బ్లడీ ఫూల్! సిగిరెట్ కావాల్సి వచ్చిందా? నీకు చెప్పిందేమిటి?" అంటూ అతని చెంపమీద లాగి పెట్టికొట్టాడు.

తెల్లోయాడతను. చెంప తడుముకుంటూ తలవంచు కొని నిలబడిపోయాడు.

"వంటరిగా నిలబెట్టి... రెస్పాన్సిబిలిటీ అప్పచెపితే....ఎందుకూ కొరగారు... డర్టీడండర్ హెడ్స్.... " అని తిడుతూ అతని పక్కన నిలడ్డాడు షాడో.

రెండు నిముషాల తర్వాత మరోవ్యక్తి అటు వచ్చాడు హడావుడిగా.

"బాస్ దగ్గిర్నించి కొత్త ఆర్డర్స్ వచ్చాయి. షాడోని ప్రాణాలతో పట్టుకునే ఆలోచన విరమించుకున్నారట. కనిపించిన మరుక్షణం కాల్చిచంపి పీడ విరగడ చేసుకుని రమ్మని కబురు పంపించాడు." గబగబా చెప్పి మరోచోటికి పరుగుతీశాడు.

"వెల్.... చంపితే కిల్లర్స్ గాంగ్ ప్రకటించిన బహుమతి మనకు దక్కుతుంది. లక్షాదికారుమై పోతాం.... కాస్త వళ్ళు జాగ్రత్తగా పెట్టుకొని

నిలబడు." పక్కన వున్న వ్యక్తి భుజంచరిచి సలహాయిచ్చు ముందుకు కదిలాడు షాడో.

ఠీవిగా, తాపీగా అడుగులువేస్తూ దగ్గిరలో వున్న కారును సమీపించాడు. ముందు సీట్లోను, వెనుక సీటులోను మిషన్ గన్స్ పట్టుకొని కూర్చున్నారు నలుగురు వ్యక్తులు. వారందరి కళ్ళు రోడ్డు ప్రక్కన వున్న భవనంమీదే వున్నాయి.

స్టీరింగ్ ముందు కూర్చునివున్న వ్యక్తిని సమీపించి తలుపుమీద వేలితో మీటాడు షాడో – అర్జెంటుగా

ఉలిక్కిపడి చూశాడతను.

"హెడ్ లైట్స్‌ని ఆన్ చెయ్యి... క్విక్.... అటు... అటు..." వేలితో ఒక దిశకు చూసిస్తూ త్వరత్వరగా అన్నాడు షాడో.

అదిరిపడి హెడ్ లైట్స్‌ని వెలిగించాడతను. రోడ్డుంతా ప్రకాశవంతమయింది. ఆ వెలుగులో – వారి బాస్ పంపిన కొత్త ఆజ్ఞలను అందరికీ చేరవేయటానికి అటూ యీటూ పరుగులు తీస్తున్న వ్యక్తి..... క్షణంపాటు కనిపించి.... వెంటనే చీకటిలోకి వెళ్ళిపోయాడు.

"అదుగో పారిపోతున్నాడు! షాడో పారిపోతున్నాడు.... ఫైర్?" పెద్దగా అరిచాడు షాడో.

మరుక్షణం కారులోని మిషన్ గన్లు నిప్పులు కక్కటం ప్రారంభించాయి. ఏ క్షణంలో షాడో ఎదురౌతాడో అనుకుంటూ ట్రిగర్స్ మీద వేళ్ళు బిగించుకొని కూర్చున్నారు వారందరూ, షాడో అరుపులతో వారికి ఆలోచించే వ్యవధి లేకపోయింది.

మిషన్ గన్ మోతలతో దద్దరిల్లి పోయిందా నిశీధి. పాపం..... డ్యూటీని నిర్వర్తించటానికి విపరీతంగా శ్రమపడుతున్న ఆ వ్యక్తి.... ఒక కాలు గాయపడి.... కింద పడిపోయాడు.... తను షాడో కాదని పెద్దగా అరిచి అందరికీ తెలియచేయటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తున్నాడు.

"కమాన్! పోయి చూడండి... వెళ్ళండి... కదలండి... కారు దిగండి!" ఖంగుమంది షాడో గొంతు.

బిలబిలా కారు దిగారు అందరూ. ఆయుధాలు గురిపెట్టి రోడ్డుప్రక్కకు పరుగుతీశారు. మిగిలిన కార్లులో కలకలం చెలరేగింది. అక్కడికి వచ్చిన వారందరూ. రోడ్డు మధ్య గుమికూడటం ప్రారంభించారు.

కాళ్ళ వెనుక తచ్చట్లాడుతున్న కుక్కపిల్లను ఎత్తికారు లోకి విసిరాడు షాడో. విగ్గును, గడ్డాన్ని తీసి రోడ్డుమీద పడవేసి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

అది గమనించాడో వ్యక్తి. అరిచి అందరికీ చూపించాడు. అప్పటికే కారును ముందుకు కదిలించాడు షాడో. హెడ్ లైట్స్ ఆర్పి... శరవేగంగా ముందుక దూకించాడు.

మిషన్ గన్స్, రైఫిల్స్ రివాల్వర్లు... అన్నీ కలిపి ఒక్కసారిగా గర్జించటం ప్రారంభించాడు.

పగిలిన అద్దం ముక్కలు రాకెట్లలాగా వచ్చి మీద పడుతున్నా లక్ష్యపెట్టకుండా వారి మధ్యనుంచి కారును పోనిచ్చాడు షాడో. రెండు క్షణాలలో వారి ఫైరింగ్ రేంజిని దాటి దూరంగా వెళ్ళిపోయాడు.

* * *

“మైడియర్ జంటిల్మన్! పాకిస్థాన్‌లో మన కార్యక్రమాలు అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమైన పట్టణాల్లోను, పెద్ద పెద్ద గ్రామాల్లోను మన బ్రాంచీలు నెలకొల్పబడ్డాయి. ఇక నెమ్మదిగా ప్రభుత్వ యంత్రాంగంలోకి ప్రవేశించి.... ప్రభుత్వం మన ఆశయాలకు అనుగుణంగా నడుచుకునేటట్లు చేయటం ఒకటే మిగిలివుంది.” విస్కీ గ్లాసును ఎత్తి గుటకలువేస్తూ మాటలు ఆపి అందరివంకా దూశాడా వ్యక్తి.

ఆరడుగుల ఎత్తున్నాడు. ఎత్తుకు తగిన లావు. అంతే అతన్ని గురించి మిగిలిన వివరాలు తెలుసుకోవటానికి అతన్ని గురించి మిగిలిన వివరాలు తెలుసుకోవటానికి అవకాశం లేకుండా తలనుంచి పాదాలదాకా నల్ల బురకాను ధరించి వున్నాడు.

అతని ముందు కుర్చీలలో పదిమంది వ్యక్తులు కూచున్నారు. అందరూ దృఢకాయులే. నలభై సంవత్సరాలు వారి నుంచి .... అరవై సంవత్సరాలవరకూ వయస్కు వున్న వారు వారందరూ.

విస్కీ గ్లాసును టేబిల్ మీద పెట్టి గొంతు సవరించకున్నాడు బురకా ధరించిన వ్యక్తి.

“మైడియర్ జంటిల్మన్! పాకిస్థాన్‌లో ఇక అతిగా శ్రమపడవలసిన అవసరంలేదు. మన నెక్ట్స్ స్టెప్ భారతదేశంలో వేయాలని నిర్ణయించాను. భారతదేశం పాకిస్థాన్ వంటిదికాదు. అక్కడి పోలీసు బలగం, సి.ఐ.డి శాఖ, అతి సమర్ధనీయమైనవి. వారందర్నీ మించి సి.ఐ.బి..... దాని ఏజెంట్లు.... భారతదేశంలో విద్రోహక చర్మ తలఎత్తకుండా అనుక్షణం అప్రమత్తతగా

వుంటారు. సి.ఐ.బి. టాప్ ఏజెంట్ షాడో సంగతి మనకందరికీ తెలుసు. అతన్ని చంపటానికి ఎవరెవరు ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తున్నారో మనం చూస్తూనే వున్నాం. షాడోని బందించి మాటాడించగలిగితే భారతదేశపు సెక్యూరిటీ రహస్యాలు అనేకం తెలుస్తాయి. అందుకే రెండు నెలలపాటు ఢిల్లీ మాటువేసి అతి ప్రయత్నంమీద అతన్ని బంధించగలిగాం.

"మైడియర్ ఫ్రండ్స్! షాడో తన పేరును సార్థక పరుచుకున్నాడు. చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నాడు. ఫతేపూర్ నుంచి కరాచీ వచ్చాడు. ఎందుకైనా మంచిదని షాడో విషయం పాకిస్థాన్ ప్రభుత్వానికి తెలిసేటట్లుచేశాం. ఇప్పుడు మనమేకాదు – పోలీసులు, సి.ఐ.డి.లు, ఏజెంట్లు ఎందరో షాడో ప్రాణాలకోసం వేట ప్రారంభించారు.

"అయినా అందరికీ టోకరా యిచ్చి ఎవరితోనో పారిపోయాడు షాడో. ప్రస్తుతం అతన్ని అనుసరిస్తున్నారు మనవాళ్ళు కొందరు. అతన్ని ప్రాణాలతో పట్టుకునే ఆలోచనను విరమించి, చంపమని ఆర్డర్లు యిచ్చాను. షాడో పోతే సి.ఐ.బి. నడుములు విరిగినట్లే. మన పని మరి కొంచెం సుకరమౌతుంది. మైడియర్ ఫ్రండ్స్! లెటజ్ వెయిట్ ఫర్ దట్ గుడ్ న్యూస్ –"

అదే సమయంలో అతని ముందున్న టెలీఫోన్ మోతలు చేసింది. ఉపన్యాసాన్ని ఆపి రిసీవర్‌ని ఎత్తాడతను. అవతలి వైపు నుంచి వినవచ్చిన మాటలు అతని పళ్ళను పటపట లాడించాయి.

"వ్హాట్? తప్పించుకున్నాడా? ఎలా? మీరందరూ ఏం చేస్తున్నారు?" కోపంగా గర్జించాడు మౌత్ పీస్‌లో.

“బాస్! బాస్!!” అంటూ వినవచ్చింది అవతలి కంఠం భయంగా.

“బాస్! షాడోని పట్టుకోవటం సామాన్యమైన పని కాదని మీకూ తెలుసు బాస్. పాతికమంది అనుచరులను వెంట పెట్టుకుపోయాను..... బాస్! షాడోని పట్టుకోవాలంటే నెంబర్లు ముఖ్యంకాదు.. బుర్ర ముఖ్యం. తెలివితేటలు లేని చచ్చు దద్దమ్మలు నాతో వున్నవాళ్ళందరూ. ఆర్డర్లు యిస్తున్నది ఎవరో తెలుసుకోకుండా ఒకళ్ళ నొకళ్ళు కాల్చిచంపుకోబోయారు. షాడో ఒక్క ఆయుధాన్ని కూడా ఉపయోగించలేదు. కనీసం ఎవరినీ బలవంతంగా బాది గాయపరచను కూడా లేదు. తెలివిగా ప్లేటు మార్చి.... పారిపోయాడు.”

టేబిల్ మీద వేళ్ళతో దరువులేస్తూ ఆ మాటలు విన్నాడు బాస్.

“ఆల్‌రైట్.... మీరు స్థావరానికి వచ్చేయండి. ఏం చెయ్యాలో..... ఎలా చేస్తే ఈ షాడోని మట్టుబెట్టవచ్చో నాకు బాగా తెలుసు. మనవాళ్ళందర్నీ స్థావరంలో హాజరు కమ్మని కబురు పంపు... నువ్వు వెంటనే వచ్చేయ్” అని రిసీవర్‌ని క్రెడిల్ చేశాడు.

“వెల్ జంటిల్మన్... మనం మరోసారి బాగా ఆలోచించి ప్లాన్లు తయారు చేసుకోవలసిన సమయం ఆసన్నమయింది...” అంటూ ఒక కుర్చీని టేబిల్ ముందుకు లాక్కుని కూర్చున్నాడు.

అతని ఎదురుగా కూర్చున్న వారందరూ లేచి టేబిల్ చుట్టూ నిలబడ్డారు. వారందరినీ వేరువేరుగా పిలిచి చేయవలసిన పనులను గురించి వివరించి చెప్పటం ప్రారంభించాడు – నల్ల బురకా వేసుకున్న వారి బాస్.

* * *

కరాచీ సెంట్రల్ స్టేషన్‌కి కొంచెం దూరంలో కారు ఆపి.... కిందికి దిగాడు షాడో.

మరోసారి మొదలైంది గాలీవాన. స్టేషన్ ముందుభాగం అంత నిర్మానుష్యంగా వుంది.

కరెక్టుగా పన్నెండు గంటలకు లాహోర్ పోయే పాసింజర్ ట్రైన్ ఒకటి వుంది. అందులో ఎక్కి.... ఎంత త్వరగా కరాచీ వదిలిపెడితే అంత మంచిదనే ఆలోచనలో వున్నాడు.

రోడ్డు మీద జానెడు ఎత్తున నీళ్ళు నిలిచాయి. కారులో నుంచి కిందికి దిగటానికి తటపటాయిస్తున్నది కుక్కపిల్ల.

"కమాన్! కమాన్ బేబీ...." అంటూ విజిల్ వేశాడు షాడో.

ధైర్యం చేసి నీటిలోకి దూకిందది. నాలుగు అడుగులు వేసి ఎందుకో పక్కకు తిరిగింది. మరుక్షణం దాని తోక నిఠారుగా లేచి నిలబడింది. కోరపళ్ళు బయటికి కనపడేలా నోరు తెరిచి భయంకరంగా అరవటం ప్రారంభించింది.

అదిరిపడి అటు చూశాడు షాడో. వెంటనే వెనక్కి దూకాడు. ఒక్క గంతులో కారును సమీపించి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

అదే సమయంలో పోలీస్ విజిల్స్‌తో ఆ ప్రదేశం మార్మోగి పోయింది. గోడల చాటునా, దుకాణాల చాటునా నిలబడివున్న పోలీస్ కానిస్టేబుల్స్ పుట్టలోనుంచి వెలువడిన చీమల్లా కారును చుట్టు ముట్టారు.

“మిస్టర్ షాడో! మర్యాదగా లొంగిపోవటం మంచిది పారిపోవటానికి ప్రయత్నిస్తే ప్రాణాలు పోగొట్టుకుంటావ్” అన్న హెచ్చరిక వురుములా వినిపించటం ప్రారంభించింది – రైల్వేస్టేషన్ ముందున్న ఒక కారులోనుంచి.

కుక్కపిల్ల కారులోకి ఎక్కగానే క్లచ్ మీదినుంచి కాలును తొలగించి ముందుకు దూకించాడు షాడో. వేగంగా స్టేషన్ పక్కన వున్న రోడ్డుమీదికి పోనిచ్చాడు.

“ఫైర్! ఫైర్!!” అని వినిపించింది స్టేషన్ ముందున్న కారులోనుంచి. వెంటనే ధన్ ధన్.... ధనాధాన్! మని శబ్దంచేస్తూ టియర్ గాస్ షెల్ప్ కారుచుట్టూ పడటం ప్రారంభించాయి. రైఫిల్ బుల్లెట్లు కారు రేకులకు రంధ్రాలను ఏర్పరచసాగాయి.

రోడ్డుకు అడ్డంగా నిలబడిన రెండు కార్లను చూడగానే పళ్ళు బిగించాడు షాడో. యాక్సిలేటర్ని అడుగుకంటా తొక్కిపట్టి అతి వేగంగా వాటిని సమీపించాడు.

తప్పించుకు పోయే సందులేదు. ఏమాత్రం స్లో చేసినా...... టియర్ గాస్ కళ్ళను మండించి గుడ్డివాణ్ణి చేసేస్తుంది. ఈ లోపల దారితప్పిన ఏదో ఒక బుల్లెట్ ప్రాణాలను బలి పుచ్చుకోక మానదు.

ఆగి పోవాల్సిన కారు ఆగకుండా అదే వేగంతో వస్తూ వుండటం గమనించి పోలీసు కార్లలోని పోలీసులు భయపడి కిందికి దూకి, దూరంగా పారిపోయారు.

వారి వెనుకే వారి కార్లను సమీపించాడు షాడో. యాక్సిలేటర్ మీదినుంచి కాలును తీయకుండా.... ఒక్కసారి బ్రేకును చివరికంటా నొక్కి వెంటనే వదిలేశాడు.

ఒక్కసారిగా గాలిలోకి లేచింది కారు. ఇంజన్‌లో నుంచి ఫట్ మన్న శబ్దం వినవచ్చింది. కారు బాయ్‌నెట్ ఎగిరి దూరంగా పడిపోయింది. ఇంజన్‌లో నుంచి మంటలు వెలువడ్డాయి.

అయినా షాడో అవసరం తీరింది. రెక్కలు వచ్చినట్లు ఆరు అడుగుల ఎత్తుకు లేచి అడ్డున్న కార్ల మీదినుంచి జంప్ చేసింది అతని కారు. కిందికి దిగే సమయంలో మాత్రం తల్లకిందులుగా పల్టీకొట్టి.... ఆగిపోయింది. పెట్రోల్ టాంక్ నుంచి పొగలు వెలువడసాగాయి.

కారు పల్టీ కొడుతుందని వూహించి తలుపు తెరిచి రెడీగా వున్నాడు షాడో. గాలిలోకి లేచిన మరుక్షణం కిందికి దూకేశాడు.

ఎక్కడినుంచో ఒక సెర్చిలైట్ ఆ కారును కవర్ చేస్తోంది.... అది కిందికి దూకుతున్న షాడోను చూపెట్టలేదు.

రోడ్డుమీద పడిన మరుక్షణం పాములాగా పాకుతూ ఒక పోలీస్ కారుకిందికి పోయాడు షాడో.

రోడ్డుమీద నిలిచిన నీళ్ళు.... అతన్ని సగం దాచేశాయి. అదే సమయంలో అతని కారు పెద్దశబ్దంతో పేలిపోయింది. ఆ చుట్టుపక్కల వున్న పోలీసులు దూరంగా పారిపోయారు.

వందగజాల దూరంలో వున్న చిన్న సందు షాడోని ఆహ్వానించింది. జోరుగా కురుస్తున్న వర్షం అతన్ని యితరులకు సరిగా కనిపించనీయకుండా అడ్డుపడింది.

చల్లగా మోకాళ్ళమీద పాకుతూ రోడ్డుదాటాడు షాడో. స్టేషన్ ముందున్న కారులోంచి ఏవో హెచ్చరికలు, ఆజ్ఞలు వినిపిస్తూనే వున్నాయి పోలీసులు పేలిపోయిన కారును సమీపించే ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

వారందరి కళ్ళల్లో దుమ్ముకొట్టి జారుకోనే జారుకున్నారు షాడో.

* * *

తెల్లవారు ఝామున నాలుగు గంటల సమయం అది కరాచీ పోలీస్ కంట్రోల్ రూమ్ – రెయిన్ కోట్లు ధరించిన పోలీసు ఆఫీసర్లతో నిండిపోయి వుంది.

నిద్రలేక ఎర్రబడిన కళ్ళతో, సిగిరెట్ మీద సిగిరెట్ కాలుస్తూ వారిముందు పచార్లు చేస్తున్నాడు ఐ.జి.పి.

"ఇంతకంటె అవమానం మనకు యింకోటి ఎదురు కాదు, రెండువందల మంది పోలీసులు పన్నిన వలనుంచి ఆఫ్టరాల్ .... ఒక మనిషి – ఆయుధం అనేది వుపయోగించకుండా తప్పించుకు పోయాడంటే.... సిగ్గుపడాలి మనమందరం."

మౌనంగా నిలబడివున్న ఒక పోలీసు అధికారి చిన్నగా దగ్గి ఆయన మాటలకు అడ్డు వచ్చాడు.

"సార్! తప్పించుకున్నది ఆఫ్టరాల్ ఒక మనిషి కాదు– ఇండియన్ సీక్రెట్ ఏజెంట్ మిస్టర్ షాడో!!"

“అయితే ఏమిటి? షాడో కేమైనా కొమ్ములున్నాయా? మనందరికీలేని మరో జత చేతులు, కాళ్ళు వున్నాయా? పిల్లికి వున్నట్లు తొమ్మిది ప్రాణాలున్నాయా?”

“క్షమించాలి సార్! మీరు అన్నవన్నీ అతనికివున్నాయి గట్టిగా మాట్లాడితే ఇంకో రెండింతలు ఎక్కువే వున్నాయి లేకపోతే ఏమిటిసార్? ఎంత ప్రాణాలకు తెగించినా, ఒక సామాన్యమైన కారును ఆరు అడుగుల ఎత్తుకు జంప్ చేయించి – అది తేలికగా తప్పించుకోగల శక్తి మనలో ఎవరికి వుంది?” మొండిగా బదులు చెప్పాడు ఆ ఆఫీసరు.

ఐ.జి.పి. మండిపోయాడు. పళ్ళు కొరుకుతూ అతని వంక చూశాడు కాని అతని పక్కన వున్న ఆఫీసర్ల ముఖాలమీది భావాల్ని గమనించి తన కోపాన్ని తనలోనే అణిచి వేసుకున్నాడు.

“యస్! ఎంత అధికారం చేతిలో వున్నా మెజారిటీ అభిప్రాయాలకు విరుద్ధంగా ప్రవర్తించటం మంచిది కాదు.

“ఆల్‌రైట్! షాడో ఒక సూపర్‌మాన్! ఫ్లయింగ్ బాంబ్! వప్పుకుంటున్నాను. ఎంత సూపర్‌మాన్ అయినా ఎక్కడో ఒక చోట తడబడ్డ మానడు. కరాచీని బిగించేయాలి మనం. పోలీసులకు తెలియకుండా ఒక్క యీగ కూడా కరాచీ సరిహద్దులు దాటకూడదు, బస్ డ్రయివర్లను, కండక్టర్లను హెచ్చరించండి. టాక్సీ డ్రయివర్లను కలుపుకోండి... సి.ఐ.డి. బృందాలను మారువేషాలతో పహరా పారంభించమని చెప్పండి. ఇరవైనాలుగు గంటల్లో షాడోని నేలకూల్చి తీరాలి. అందుకు సహకరించిన కరాచీ పౌరులను

కోటీశ్వరుల్ని చేస్తామని ప్రకటించండి..... యూ డూ వాట్ యూకెన్ డూ... నాకు కావాల్సింది ఆ షాడో తల.... అర్థం అయిందా? ఐ వాన్ట్ ఫ్లయింగ్ బాంబ్స్ హెడ్!" ఆవేశంతో అరిచాడు ఐ.జి.పి.

ఐదు నిముషాలలో ఆయన ఆజ్ఞలు ఆచరణలో పెట్టబడ్డాయి. రిజర్వ్ పటాలాలు లారీలలో కరాచీ పొలిమేరలను బిగించి వేశాయి అనుమానం వస్తే కాల్పులు జరిపి ఆ తర్వాత తీరికగా విచారించమని వారందరికీ ఆర్డర్లు.

కరాచీ వీధులన్నీ పోలీసుకార్లతో నిండిపోయాయి.

పోలీసులను చూసి ఖంగారుగా పక్కకు తొలిగిన ప్రతివ్యక్తిని పట్టుకొని కస్టడీలోకి తీసుకుంటున్నారు పోలీసులు.

రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, హార్బర్, విమానాశ్రయం, అన్నీ సి.ఐ.డిలతో నిండిపోయాయి.

షాడోని హతమార్చి శాశ్వతంగా భూస్థాపితం చేయాలన్న పట్టుదలతో పహారా యిస్తున్నారు అందరూ.

* * *

కరాచీ పట్టణం మధ్యలోవున్న మసీదులో తలదాచుకున్నాడు షాడో. తూర్పుదిక్కు తెల్లబడుతున్నది. వర్షం ఆగిపోయింది.

షాడో బట్టలన్నీ బురదదతో నిండిపోయి వున్నాయి. శరీరమంతా మకిలిగా వుంది. జుట్టు చిందరవందరగా ముఖం మీదికి వాలుతున్నది.

షాడో పక్కనే ముడుచుకు కూర్చుని వున్నది కుక్క పిల్ల. చలి, ఆకలి దాన్ని విపరీతంగా బాధిస్తున్నాయి. షాడో వంక చూచి తోక ఆడిస్తూ జాలిగా మూలుగుతున్నది.

షాడో గుండె ద్రవించి పోయింది దాని బాధను గమనించగానే.

“నాతో తిరిగితే నీకీ బాధలు తప్పవు బేబీ.... ఇక నీ దారి నువ్వు చూసుకోవటం మంచిది” అంటూ దాన్ని మసీదు బయటికి తీసుకుపోయి వదిలిపెట్టి వచ్చాడు.

అతని వెనుకేవచ్చి యధాస్థానంలో పడుకున్నదది. షాడోలేస్తే లేచి నిలబడుతున్నది. కూర్చుంటే కూర్చుంటున్నది. ఎన్ని చేసినా.... అతన్ని వదిలిపెట్టిపోయే అభిప్రాయం మాత్రం తనకు లేదని స్పష్టంగా తెలిసేటట్లు ప్రవర్తిస్తున్నది.

రోడ్ మీద పోలీసులు గస్తీ తిరగటం గమనించాడు షాడో. ఎందుకో గ్రహించటానికి ఏమంత ఆలోచించవలసిన అవసరం లేకపోయింది. ఒక పోలీస్ వాన్ మసీదు ముందు ఆగి ఆ చుట్టుపట్లు వున్న పౌరులను హెచ్చరిస్తున్నది. షాడో అనబడే వచ్చి హంతకుడు, దొంగ, కేడి, కిలాడీ భారతదేశం పంపించగా పాకిస్థాన్‌లో అల్లర్లు లేపటానికి కరాచీ వచ్చాట్ట! అతన్ని పట్టియిచ్చిన వారికి ఘన మైన బహుమతులను యిస్తుందిట పోలీస్ డిపార్ట్‌మెంట్"

“బేటా! ప్రార్థన చేయవలసిన వేళ అయింది. ఇంకా అలాగే కూర్చున్నావేం?” షాడో వెనుక నుంచి వచ్చాయి ఆ మాటలు.

ఉలిక్కిపడి తిరిగాడు షాడో. పది అడుగుల దూరంలో ఎనభై సంవత్సరాల వృద్ధుడు నిలబడి వున్నాడు. షాడో పోలీసు హెచ్చరికలను వింటున్న సమయంలో మసీదు పక్కనున్న ద్వారంలోనుంచి లోపలకు వచ్చాడు.

"నేను ముస్లిమ్‌ని కాదు... కొన్ని కారణాలవల్ల యీ ప్రదేశంలో తల దాచుకున్నాను." లేచి నిలబడుతూ సమాధానం యిచ్చాడు షాడో.

చిన్నగా, అర్థం అయినట్లు నవ్వాడా వృద్ధ మహమ్మదీయుడు.

"బేటా! భగవంతుణ్ని ప్రార్థించటానికి జాతి మతాలు పట్టింపులు అవసరం లేదు. ముస్లిమ్‌లే ప్రార్థన చెయ్యాలని నిబంధన ఎక్కడా లేదు. ప్రాతఃకాలంలో ప్రార్థన చేయకూడదని మీ మత గ్రంథాలు నిర్బంధిస్తున్నాయా?"

మారు మాటాడకుండా మసీదు ఆవరణలో వున్న చిన్న నీటి కొలనులో కాళ్ళు చేతులు శుభ్రపరుచుకు వచ్చాడు షాడో.

వృద్ధ మహమ్మదీయుడు అందించిన టవల్‌తో తడి తుడుచుకొని భగవత్ స్వరూపమని వారు భావించే డయాస్ ముందు మోకరించి కూర్చున్నాడు.

ప్రార్థన ఆరంభించాడా వృద్ధుడు... పావుగంట తరువాత కనులు విప్పి షాడో వంక చూసి చిరునవ్వు నవ్వాడు

"బేటా.... భారతీయులు ముసల్మానులకు శత్రువులు.... మహామ్మదీయ మతం అంటే అసహ్యించుకుంటారని మా ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. మరి నువ్వు మా మత నియమాలకు గౌరవించటం... నాకు ఆశ్చర్యాన్ని, అనందాన్ని కలగచేస్తోంది."

గంభీరంగా నవ్వాడు షాడో. పాకిస్థాన్ ప్రభుత్వం వైఖరే అంత. ప్రపంచంలో వున్న ముస్లిమ్ జనాభాలో అరవైశాతం భారతదేశంలో వున్నదని, అక్కడ హిందూమతం తర్వాత అతి ముఖ్యమైన మతం మహమ్మదీయ మతమేననీ.... ఎంత మంది పాకిస్థానీయులకు తెలుసు?

రంజాన్, మొహరం వుత్సవాలలో పాలుపంచుకునే హిందువులను గురించి, దీపావళి, సంక్రాంతి పండుగల ఆనందాన్ని అనుభవించే ముస్లిమ్‌లను గురించి పాకిస్థాన్ పౌరులకు ఎంతవరకు తెలుసు?

భగవంతుడు నిర్వచించిన నీతి పాఠాలకు మారు అర్థాలు కల్పించి, తమ తమ స్వలాభాలకు వుపయోగించుకునే నరరూప రాక్షసులు అధికారంలో వుంటే.... యిలాంటి అపనమ్మకాలు..... అర్థం లేని అనుమానాలు చెలరేగుతూనే వుంటాయి.

షాడో అభిప్రాయాలు ఆ వృద్ధుడి కళ్ళ వెంట ఆనంద భాష్పాలను వెలువరించాయి.

"బేటా! నిజం చెప్పావ్..... నీ దేశం మీద అపవాదులు వేస్తున్నందుకు మా మీద కోపం లేదన్న మాట" అన్నాడు.

"మా కోపం పాకిస్థాన్ ప్రజల మీద కాదు..." అంటూ అసలు తను పాకిస్థాన్‌లో ప్రత్యక్షం కావటం వెనుక వున్న విషయాలను వివరించి చెప్పాడు షాడో.

"చాలా సంతోషం..... రా బేటా... మా యింటి పోదాం..." అంటూ లేచాడా వృద్ధుడు.

"హజ్రత్! నేను పరారీలో వున్న నేరస్థుణ్ని""

"బేటా..... నువ్వు ఎవరో నాకు తెలియదని అనుకోకు. మొదటి చూపులోనే నాకు అన్ని విషయాలు అర్థం ఆయ్యాయి. అందరూ అనుకునే మాటలు ఎంతవరకు యదార్థాలో తెలుసుకుందామని నిన్ను యిలా తరిచి మాట్లాడించాను." అంటూ షాడో చేయి పట్టుకొని తనవెంట లేవతీశాడా వృద్ధుడు. ఎవరికంటా పడకుండా సందు గొందువెంట తిప్పి తిప్పి.... తన యింటికి తీసుకు పోయాడు.

అతను యిచ్చిన పొడి దుస్తులు ధరించి... కడుపునిండా భుజించి.... కుక్క పిల్ల అవసరాలను గమనించి.... యింటి వెనుక వున్న చిన్న పాకలో విశ్రమించాడు షాడో.

తిరిగి లేచే సరికి రాత్రి ఎనిమిది గంటలు అయింది. కళ్ళు తెరిచే సరికి పక్కనే కూర్చుని కాండిల్ లైటు ఏదో మత గ్రంథాన్ని చదువుకుంటున్న వృద్ధుడు కనిపించాడు.

"నువ్వు కొంతకాలం యిక్కడే వుండాలి బేటా! నిన్ను పట్టుకునే ప్రయత్నాలు తీవ్రతరం అయ్యాయి. నాలుగు బెటాలియన్ల సైన్యాన్ని కరాచీ చుట్టూ కాపుంచారు. నువ్వు యీ పరిస్థితిల్లో ఎక్కడికీ కదలకూడదు." అన్నాడు షాడో లేవటం గమనించగానే.

"నాకు ఆశ్రయం యిచ్చారని తెలిస్తే మీకు లేని పోని ప్రమాదాలు ఎదురు కావచ్చు...." బదులు పలికాడు షాడో.

అదే సమయంలో ఒక ట్రే నిండా వేడి వేడి తినుబండారాలతో పాకలోకి వచ్చింది ఆ వృద్ధుడి మనుమరాలు– పదిహేను సంవత్సరాల పడుచుపిల్ల "భయ్యా! మా మూలకంగా నీకు యిటువంటి విషమ పరిస్థితి ఏర్పడింది. అది తొలగించాల్సిన బాధ్యత కూడా మా మీదే వుంది. ఈ సందడి సద్దు మణిగే దాకా నువ్వు యిక్కడే వుండాలి" అన్నది పట్టుదల నిండిన కంఠంతో. వారి అభిమానానికి, ఆదరానికి ముగ్ధుడైనాడు షాడో.

* * *

సాయం సమయం. నాలుగు గంటల సమయం. వృద్ధ మహమ్మదీయుడు తెచ్చియిచ్చిన వుర్దూ నవల నొకదాన్ని చదువుతున్న షాడో.... బాణంలా పరిగెత్తుకు వచ్చిన కుక్కపిల్లను చూసి కనుబొమలు ముడివేశాడు.

ఒక చోట నిలబడకుండా, ఎగిరెగిరి పడుతూ చిన్నగా గుర్రుపెడుతున్నదది. "వాటీజ్ యిట్ బేబీ?" మృదువుగా అడిగాడు షాడో.

సమాదానంగా ముందున్న యింటివైపు చూసి భీకరంగా మొరిగిందది.

డోబర్ మాన్ జాతికి చెందిన వేట కుక్క అది. జాడలను పసికట్టటంలో ఆ జాతిని మించిన జాతి ప్రపంచంలో మరెక్కడా లేదు.

షాడోతో తిరగటం వల్ల... అతన్ని చూసి వెంటపడే వారు శత్రువులని వారికి జాగ్రత్తగా గమనిస్తూ వుండాలని దాని చిన్ని హృదయానికి బాగా అర్థం అయింది.

దాని ప్రవర్తన చూడగానే ప్రమాదం ముంచుకు వస్తోందని తెలుసుకున్నాడు షాడో. మంచాన్ని ఎత్తి ఒక మూలకు విసిరి.... నేల మీద సిగిరెట్

పీకలను ఏరి పాయింట్ జేబులో వేసుకున్నాడు. పాకలో తను మకాం వేసినట్లు చూపించగల జాడలను తుడిచి వేసి.... ప్రహరీ గోడ దగ్గిరికి పరుగు తీశాడు.

కుక్కపిల్ల అంతగా గలాటా ఎందుకు చేస్తోందో అప్పుడు బాగా అర్థం అయ్యింది. ఆ వీధి అంత పోలీస్ వాన్లతో నిండి వుంది. ఒక్కొక్క యింటినీ జాగ్రత్తగా చెక్ చేస్తూ వస్తున్నారు పోలీసులు.

మరో దారి కోసం వెతికాడు షాడో. కనిపించలేదు ఆవరణ దాటటానికి ప్రయత్నిస్తే పోలీసులకంట పడటంతథ్యం అని తేలిపోయింది.

ఓరగా వేసి వున్న యింటి వెనుక తలుపుల్ని తోచుకుని లోపలికి పోయాడు. కిచెన్ లోనే ఆగి పోవాల్సివచ్చింది.

అప్పటికే ఒక పోలీస్ స్క్వాడ్ వృద్ధుడిని కలుసుకొని యింటిని సెర్చి చేస్తామని నిర్భందిస్తోంది.

వృద్ధుడు, అతని మనుమరాలు.... అతి ప్రయత్నం మీద తమ భయాన్ని కప్పి పెట్టుకుంటూ – వారిని ఆపటానికి ప్రయత్నిస్తున్నారు.

పిల్లిలా అడుగులు వేస్తూ వెనక్కి వచ్చాడు షాడో. దాక్కోవాలి! లేదా పారిపోవాలి!!

ఎట్టి పరిస్థిలోను తన మూలకంగా ఆ వృద్ధునికి ఆపద రాకూడదు. పోలీసులు చూసినా సరే... ఆవరణ దూకిపారి పోవాలి. తనను ఆ యింటితో కనెక్ట్ చేయకుండా, తనకు ఆ వృద్ధునికి సంబంధం వుందని తెలియకుండా వుంటేచాలు! ప్రహరీ పక్కకు పోతుండగా.... ప్రహరీని అనుకొని వున్న బావి షాడో ఆలోచనల్లోకి ప్రవేశించింది.

దగ్గిర దగ్గిరగా యాభై అడుగుల లోతు వున్నదది. నీళ్ళు మరో పదిఅడుగుల లోతు వుంటాయి.....

"బేబీ... యూ కీప్ క్వయిట్!! అరవకుండా కూర్చో అర్థం అయిందా?" కుక్క పిల్లతల నిమిరి బావి గట్టుమీదికి ఎక్కాడు షాడో.

వింతగా చూస్తూ వెనుక కాళ్ళ మీద కూర్చుంది కుక్కపిల్ల.

పది అడుగుల లోతుకు యీజీగానే దిగాడు షాడో.

అక్కడినుంచి సరయివ పట్టు దొరకలేదు. జఁరున జారిపోయాడు. పెద్ద శబ్దం కాకూడదనే వుద్దేశ్యంతో తల్లకిందులుగా పల్టీ కొట్టి.... చేతులు ముందుకు జాచి బాణంలా నీటిలో దిగాడు.

పది పౌండ్ల రాయి నీటిలో పడినట్లు శబ్దం అయింది. మరుక్షణం ఎగిరి బావి గట్టు మీదికి దూకింది కుక్కపిల్ల లోపలికి చూస్తూ.... గంయ్ మని గోలచేయసాగింది.

పదిహేను అడుగుల లోతున్నాయి నీళ్ళు. కిందికి పోయి.... మెల్లిగా పైకి తేలాడు షాడో. తల బయటికి రాగానే..... కుక్కపిల్ల అరుపులు వినవచ్చాయి.

షాడో గుండె ఝల్లుమన్నది. ఆ అమాయక జీవి – ఆత్రుత తనకు ప్రాణాంతకం కాబోదుగదా!!

అదే సమయంలో బూట్ల శబ్దం.... నాలుగైదు కరకు కంఠాలు వినవచ్చాయి. ఏమయితే అదయిందనుకుంటూ, చటుక్కున నీటిలోకి మనిగాడు షాడో.

“ఎవరూ లేకపోతే మీకీ ఆత్రుత దేనికి హుజ్రత్? ఇది మా డ్యూటీ. కాదు కూడదని మీరు అడ్డు పడితే పోలీస్ స్టేషన్‌కి రావాల్సి వస్తుంది” అపటానికి ప్రయత్నిస్తున్న వృద్ధుణ్ని గద్దిస్తూ యింటి వెనక్కు వచ్చారు నలుగురు పోలీసులు.

ఇంట్లో – వారికి అనుమానం కలిగించే విషయాలేమీ కనిపించలేదు. ఇంటి వెనుక పాకలో .... షాడో ముందు జాగ్రత్తవల్ల.... వారికి అనుమానం కలగలేదు.

బావి గట్టు మీది కుక్కపిల్ల.... ఒక పోలీసుకు వింతగా కనిపించింది. అటు అడుగులు వేశాడు.

మరుక్షణం.... గంయ్ మంటూ అతని మీదికి దూకిందది. షాడో ఎందుకు దాక్కున్నాడో దానికి అప్పుడు అర్థం అయినట్లుంది – చెవులు చిల్లులు పడేటట్లు అరుస్తూ – వారిని బావి సమీపాల్లోకి రానీయకుండా అడ్డు నిలబడింది.

పోలీసులకు అర్థంకాలేదు. కాని వృద్ధుడి మనుమరాలు జీవత్ అర్థం చేసుకుంది. ఆమె భయం పటాపంచలై పోయింది. ఒక్క గంతులో కుక్కపిల్లను సమీపించి చేతుల్లోకి తీసుకొంది “చుప్ రహో.... చుప్ రహో” అని నముదాయిస్తూ.

“మీకు శ్రమ యిచ్చినందుకు మన్నించాలి.... మీరు షాడో లాంటి దుర్మార్గులకు ఆశ్రయ మివ్వరని మాకు తెలుసు. అయినా మా డ్యూటీని నిర్వహించాలి కదా! షాడో జాడలు తెలిసిన పక్షంలో.... పోలీస్ స్టేషన్‌కి రిపోర్టు చెయ్యండి. మంచి బహుమతి లభిస్తుంది.” అంటూ రోడ్ మీదికి వెళ్ళి పోయారు పోలీసులు.

"సువ్వర్ కా బచ్చా! బహుమతి యిస్తారట బహుమతి! లంచం తీసుకోందే స్టేషన్ వదిలి కాలు బయట పెట్టని యీ బద్మాష్‌లకు.... మరో మనిషిని దుర్మార్గుడు అనటానికి అర్హత ఎక్కడి నుంచి వచ్చింది?" తనలో తాను గొణుక్కుంటూ వారిని సాగనంపి మెల్లిగా ముఖద్వారం గడియవేసి వచ్చాడు వృద్ధుడు.

అతని మనుమరాలు... జీనత్ బావి గట్టుమీద కూర్చుని వుంది. వృద్ధుడు ఆవరణలోకి రాగానే బకెట్‌కి కట్టివున్న చేంతాటిని బావిలోకి వదిలింది.

నీళ్ళు కారుతున్న దుస్తులతో పైకి వచ్చాడు షాడో. వారిని చూసి చిరునవ్వు నవ్వాడు.

వృద్ధుడికి షాడో మీది అభిమానం రెట్టింపు అయింది.

"బేటా! యిప్పుడు అర్థం అయింది.... నిన్ను పట్టుకోవటానికి మిలటరీని కూడా దించారని తెలిసి, అనవసరమైన ఆర్భాటం చేస్తున్నారని అనుకున్నాను. బేటా! నిన్ను పట్టుకోవాలంటే నాలుగు బెటాలియన్లు ఏ మూలకు వస్తాయి! కనీసం వంద బెటాలియన్లు కావాలి. అప్పటికీ నువ్వు దొరుకుతావన్న నమ్మకం నాకు లేదు." అన్నాడు.

నవ్వుతూ పాకలోకి వెళ్ళాడు షాడో. తడి గుడ్డలు వదిలి. తన పాంటు, షర్టు అంతకుముందు దౌలత్ యిచ్చిన నీలంరంగు కోటు వేసుకున్నాడు.

అప్పటికి కను చీకటి పడింది. కిచెన్‌లో బిజీగా వుంది జీనత్. ముఖద్వారం దగ్గరే పడక కుర్చీలో కూర్చుని కాపలా కాస్తున్నాడు వృద్ధుడు.

చల్లగా వెళ్ళి తలుపుల చాటున కూర్చుని.... అతను తెచ్చి యిచ్చిన సిగిరెట్ నొకదాన్ని వెలిగించాడు షాడో.

వీధిలో అరగంటకొక పోలీస్ వాన్ పహరా తిరుగుతున్నది.

అష్ట దిగ్బంధనం చేసినట్లు కరాచీని బిగించేశారు పోలీసులు, చీమ చిటుక్కుమన్నా పోలీసులు పోయి చూస్తున్నారు.

"కాకా! ఇక నేను యిక్కడ వుండడం మంచిదికాదు. అదృష్టవశాత్తు యీ రోజు తప్పించుకున్నాను. రేపు యింటువంటి అవకాశం లభించక పోవచ్చు. నేను వెళ్ళి పోవాలి. పాకిస్థాన్‌ని వదిలి పెట్టి పోవాలి....." వృద్ధుడితో చెప్పాడు షాడో.

"ఎలా బేటా?" సాలోచనగా అన్నాడతను.

తన ప్లాను వివరించాడు షాడో. హార్బర్‌ని కట్టుదిట్టమైన కాపలా కింద వుంచి వుంటారు. విమానాశ్రయం గురించి ఆలోచించనే కూడదు.

"కాకా.... హార్బర్‌కి రెండు మైళ్ళ యివతల చేపలు పట్టే వాళ్ళు నివసించే మురికి పేటలవున్నాయి కదూ?" ప్రశ్నించాడు.

తల వూపాడు వృద్ధుడు.

"అక్కడికి పోయి ఏదో ఒక బోటును సంపాదించాలి. దానిలో ఎలాగో కష్టపడి పాకిస్థాన్‌కి చెందిన సముద్రభాగాన్ని దాట గలిగితే చాలు.... ఆ తర్వాత ఎటువంటి భయమూ వుండదు." అన్నాడు షాడో.

పది నిముషాలపాటు దీర్ఘంగా ఆలోచించాడు వృద్ధుడు ఏదో నిర్ణయానికి వచ్చినట్లు తల విదిలించి జీనత్‌ని పిలిచాడు.

ఇద్దరూ రెండు నిముషాలు మాట్లాడుకున్నారు.

“భయ్యా! నువ్వు యింట్లోనే వుండు. అన్ని ఏర్పాట్లు చేసి వస్తాం. రేపు రాత్రికి బయలుదేరుదువుగాని...” భరోసా యిచ్చింది జీనత్.

వారు మాట్లాడుకున్నది అర్ధం కాక పోయినా..... ఆ పల్లె సమీపాల్లో జీనత్‌కి ఎవరో స్నేహితులు వున్నట్లు షాడోకి తెలిసింది. ఆమె సమాధానంతో తృప్తిపడి తల ఆడించాడు.

పారిపోయే మార్గం కనిపించింది. ఫరవాలేదు అనుకుంటూ తృప్తి పడ్డాడే గాని.... అంతరంగపు హెచ్చరికలను పెడచెవిన పెట్టలేకపోయాడు.

ప్రమాదాలను ముందుగానే పసికట్టగల అతని సిక్స్‌త్ సెన్స్.... ప్రమాదం .... ప్రమాదం అని హెచ్చరించసాగింది.

ఆ ప్రమాదం ఏమిటో, ఏ రూపంలో వుంటుందో అర్ధంకాక తికమక పడుతూ రాత్రి గడిపాడు షాడో.

* * *

మరునాడు సాయంకాలం మూడుగంటలకు సిక్స్‌త్ సెన్స్ వార్నింగ్‌కి అర్ధం తెలుసుకున్నాడు షాడో. రెండు నిముషాల పాటు నివ్వెరబోయి నిలిచిపోయాడు.

ఆ రోజు ఉదయం పదిగంటల సమయంలో వృద్ధుడు జీనత్ కలిసి సముద్ర తీరానికి వెళ్ళారు – బోటును ఏర్పాటు చేసిరావటానికి. మూడు గంటల కల్లా తిరిగి వస్తామని చెప్పిపోయారు. వారికోసం ఎదురు చూస్తున్న షాడో – తలుపులు తోసుకొని లోనికి వచ్చిన అపరిచిత వ్యక్తిని చూసి పులిక్కిపడ్డాడు.

పాంటు బెల్టు వూడలాగుతూ మీదికి వస్తున్న షాడోను చూసి భయంతో సలాం చేశాడతను. "సాబ్.... జీనత్ కాకా స్నేహితుణ్ని నేను. మీకో విషాదం వార్తను మోసుకు వచ్చిన మూర్ఖుణ్ని" అన్నాడు బాధగా.

బెల్టును కిందికి దించుతూ ప్రశ్నార్థకంగా చూశాడు షాడో.

"సాబ్.... వాళ్ళు జీనత్‌నీ, జీనత్ కాకాని బంధించారు."

గతుక్కుమన్నాడు షాడో. "ఎవరు?" అని అడిగాడు ఆందోళనగా.

"ఎవరో తెలియదు సాబ్... చేపలు పట్టే బోటును మీ కోసం సిద్ధం చేశాం. సముద్రం మీద ప్రయాణం చేసే సమయంలో.... మీకు ఆహారం మంచినీరు చాలా అవసరం అని నీళ్ళు నింపే తోలు తిత్తులను, బిస్కట్ పాకెట్లను కొనుక్కొస్తానని చెప్పి మార్కెట్‌కి వెళ్ళింది జీనత్. అరగంటలో తిరిగి వచ్చింది. ఆమె వెంట పదిమంది రౌడీలు వచ్చారు. జీనత్ కాకాను కూడా పట్టుకొని సముద్రం వద్దున వున్న చిన్న మసీదులో బంధించారు. ఈ విషయం పోలీసులకు రిపోర్టు చేస్తే వారిద్దరి ప్రాణాలు తీస్తామని బెదిరిస్తున్నారు."

"ఓహ్! మైగాడ్!!" అనుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు షాడో.

పోలీసులతో పాటు ఆ క్రిమినల్ గాంగ్ కూడా తనను వెంటాడుతునే వున్నది. ఎందుకు? వారికి తనకు ఎటువంటి పోరాటాలు జరగలేదే? తనమీద యింత కక్ష దేనికి?

"సాబ్! జీనత్ బేటీ నాకు కూతురితో సమానం. ఈ రోజు నేను యిలా సుఖంగా బ్రతకటానికి కారకుడు జీనత్ కాకా..... అందువల్ల ధైర్యంచేసి మీ దగ్గరికి వచ్చాను సాబ్! మొదట జీవత్ అంగీకరించలేదు. తమకు ఎటువంటి

ఆపద వచ్చినా సరే..... మిమ్మల్ని మాత్రం ముందు కరాచీ సరిహద్దులు దాటించమని చెప్పింది. జీనత్ కాకా కూడా అదే మాదిరి అన్నాడు.... సాబ్! బోటు సిద్ధంగా వుంది. ఏంచేద్దాం?"

పళ్ళు కొరికాడు షాడో, పిడికిలి బిగించి బలంగా కుర్చీ చేతి మీద గుద్దాడు.

తునాతునకలైంది సగం కుర్చీ.....

"దట్ విల్ నాట్ హాపెన్ మై ఫ్రండ్... ఇంతవరకు..... ప్రాణాలు దక్కించుకోవటానికి పారిపోతూ వచ్చాను. ఇక మీదట నేను ఆడ్డం తిరిగితే ఎలా వుంటుందో ప్రత్యక్షంగా చూపిస్తాను....." పళ్ళు కొరుకుతూ అన్నాడు.

నిలువు గుడ్లతో నోరు తెరుచుకొని చూస్తూ నిలబడి పోయాడా అపరిచిత వ్యక్తి. ఆ ప్రదేశం నుంచి పారిపోవాలన్న వెర్రికోరిక ఒకటి కలిగింది – అతనికి.

బెల్టుఎత్తి మీదికి వచ్చినా.... ఎదురుగా వున్న యువకుడి కళ్ళు నవ్వుతూనే వున్నాయి అంతకుముందు. ఆ కోపంలో వింతగా కనిపించే అందం ఇమిడివుంది.

పిడికిలి బిగించి నిలబడిన ఇప్పటి యువకుడిలో..... అందంకాదు.... దండెత్తి నిలబడిన సైతాన్ కన్పిస్తున్నాడు.

* * *

దట్టమైన చీకటి సముద్రాన్ని ఆక్రమించుకొని వుంది. ఒంటరిగా నిలబడివున్న ఎలక్ట్రిక్ స్తంభంమీది నియోన్ లైటు... సముద్రం అంచునవున్న చిన్న మసీదు పరిసరాలను ప్రకాశంవంతం చేస్తోంది.

ఆకాశం మేఘాలతో నిండివుంది. రివ్వున వీస్తోంది హోరుగాలి– మసీదు ముందున్న మెట్లమీద కూర్చుని.... జెర్కిన్ని సవరించుకున్నాడు ఇబ్రహీమ్.

అతని చూపులన్నీ మసీదుకు వందగజాల దూరంలో- ఒడ్డుమీదికి లాగబడివున్న చిన్న బోటుమీద వున్నాయి.

షాడోకోసం రెడీ చేయబడిన బోటు అది. పోలీసుల కళ్ళూ తమకళ్ళూ కప్పి – దానిలో పారిపోవటానికి ప్లాను వేశాడు షాడో. పాపం" దురదృష్టవంతుడు'"

అప్రయత్నంగా నవ్వుకున్నాడు ఇబ్రహీం. గత రాత్రి అతని బాస్ చేప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనించి మళ్ళీ నవ్వువచ్చింది.

"షాడోని చంపిన వాళ్ళని.... ఈ పాకిస్థాన్ ఏరియాకు బాస్‌ని చేస్తాను. మన హోటళ్ళు, సినిమాహాళ్ళు, క్లబ్బులు సంపాదించిన లాభాలలో వన్ ఫోర్త్ వాటా ఇస్తాను. భారతదేశంలో మనం ఆచరణలో పెట్టాలని అనుకుంటున్న ప్లానులన్నీ.... అతని చేతిమీదుగా చేయిస్తాను.... షాడోని చంపి అతని తలను నాకు చూపించండి.... చాలు!"

వెంటనే బయలుదేరాడు ఇబ్రహీమ్. షాడోని గురించి తను విన్న విషయాలన్నీ నెమరు వేసుకున్నాడు. కరాచీలో పోలీసులు తీసుకుంటున్న జాగ్రత్తలను మరింత జాగ్రత్తగా గమనించి – తన ప్లానును ఆచరణలో పెట్టాడు.

హార్బర్‌ని చుట్టుముట్టిన పోలీసులు – దాని పక్కనే వున్న పల్లెగూడేన్ని మరిచిపోయారు. సముద్రంలో పహరా యిస్తున్న పాకిస్థాన్ యుద్ధ నౌకలు..... చేపలు పడుతున్న తెప్పలను నిర్లక్ష్యంగా వదిలి పెడుతున్నాయి.

షాడో అటువంటి అవకాశాన్ని వదిలిపెట్టడు.

ఇబ్రహీమ్ ఆలోచన ఫలించింది. మార్కెట్‌కి పోయిన జీనత్ చర్యలు అతని అనుమానాన్ని నిజం చేశాయి. మార్కెట్ లోనే ఆమెను బంధించి తీసుకువచ్చాడు.

సహాయం చేసినవారికి ప్రత్యుపకారం చేయందే షాడో నిద్రపోడన్న వాడుక ఒకటి ఉంది. షాడో తప్పకుండా వస్తాడు. వచ్చితీరాలి. తను ఎంత భయపెట్టినా.... పల్లెలో వున్నవారిలో ఎవరో ఒకరు షాడోకి జరిగిన విషయాన్ని వెల్లడించకపోరు.

తన స్నేహితులు తనకోసం ప్రమాదంలో చిక్కుపడిన ..... షాడో చూస్తూ వూరుకోడు.... వస్తాడు..... తప్పకుండా వస్తాడు.

తను..... నిన్నటిదాకా ఒకరి ఆజ్ఞలకు లోబడి పనిచేసిన పిక్ పాకెట్ ఇబ్రహీం.... మరో పన్నెండు గంటల్లో – పాకిస్థాన్ ఏరియాకు అధిపతి కాబోతున్నాడు – కోటీశ్వరుడుగా మారబోతున్నాడు.

కమాన్ షాడో! కమాన్ యూ బద్మాష్!! ఎంతసేపు ఎదురుచూడాలి? కాబోయే క్రిమినల్ బాస్‌ని యిలా వెయిటింగ్‌లో పెట్టటం నీకేమైనా బాగుందా?

నవ్వుకున్నాడు ఇబ్రహీమ్. జెర్కిన్ జేబులోవున్న రివాల్వర్‌ని ఆప్యాయంగా తడుముకున్నాడు.

"ఇబ్రహీం... ఎవరో వస్తున్నారు!!" మసీదు మీద కాపలా నిలబడిన సహచరుడు చిన్నగా హెచ్చరించేసరికి ఇబ్రహీం కళ్ళముందు కదులుతున్న టెక్నికలర్ కలలు కరిగిపోయాయి.

వాటి స్థానంలో – మసీదుకు వందగజాల దూరంలో నిలబడిన ఇద్దరు పల్లెవాళ్ళు కన్పించారు.

చిరిగిపోయిన దుస్తులు.... వారి బీదతనాన్ని ఎత్తి చూపిస్తున్నాయి. వారి వాలకం చూస్తుంటే భయపడుతున్నట్లు కనిపిస్తోంది.

“సాబ్.... ఓ సాబ్!!” పెద్దగా అరిచాడొక వ్యక్తి రివాల్వర్‌ని రెడీగా పట్టుకొని మెట్ల చాటున నిలబడ్డాడు ఇబ్రహీం.

“అబే! సువ్వర్ కా బచ్చా .... పిచ్చివేషాలు వేస్తే మీ ముసలాడి ప్రాణాలు తీస్తాం. ముసలాడితో వున్న ఛోక్రీని కండలు కండలుగా సరికి సముద్రంలో చేపలకు ఆహారంగా వేయిస్తాం” అని సమాధానం ఇచ్చాడు.

“సాబ్! షాడో వచ్చాడు..... మీకో వార్త అందించమని చెప్పాడు.”

ఆ మాట విన్న మరుక్షణం ఇబ్రహీమ్ వళ్ళు ఝల్లుమన్నది.

వచ్చాడు షాడో! షాడో వచ్చాడు!!

వెంటనే రివాల్వర్ ఎత్తి వారిద్దరినీ కవర్ చేశారు.

“ఎక్కడ బే ఆ షాడో? ఏడీ? కనిపించమను. చూద్దాం..” వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో అరిచాడు జీరగా.

“సాబ్! షాడో ఇక్కడే వున్నాడు. మిమ్మల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. మీతో పోరాడటానికి రెడీగానే వున్నాడు. కానీ మసీదులో మా స్నేహితులున్నారు. వారికి ఆపద రాకూడదని ఆభిలషిస్తున్నాడు. వారిని వదిలిపెట్టిన మరుక్షణం మీ ముందు ప్రత్యక్షమై ఆటో ఇటో తేల్చుకుంటాడట.”

“చుప్ బే సాలే.... నీ ముసలమ్మ కబుర్లు వినటానికి నేను దద్దమ్మని కాదు. వెధవ వేశాలు వేస్తే నీ తల చిల్లులు పొడుస్తాను” కోపంగా అరిచాడు ఇబ్రహీమ్.

ఓపికగా సమాధానం ఇచ్చాడు అవతల వ్యక్తి.

“సాబ్..... బాగా ఆలోచించుకోండి. షాడో మీ ఎదుటకు వస్తే.... పోట్లాట మొదలౌతుంది. అందులో విజయం, మీకు లభించినా, షాడోకి లభించినా మీకు

మా స్నేహితులతో అవసరం లేదుమీరు ఓడిపోతే.... కసితో వారిని చంపటానికి ప్రయత్నించవచ్చు. దమ్మువుంటే వారిద్దినీ వదిలి పెట్టిబయటికివచ్చి నిలబడమని సవాల్ చేస్తున్నాడు షాడో."

"వదలకపోతే?" అడిగాడు ఇబ్రహీమ్.

"వదలకపోతే ప్రస్తుతం షాడో చేయగలిగింది ఏమీ లేదుట. కాని యీ విషయం మాత్రం మీకు గట్టిగా చెప్పమని చెప్పాడు సాబ్... జీనత్ బేటీకిగాని, జీనత్ కాకాకు గాని ఏమాత్రం బాధ కలిగినా, ప్రమాదం వాటిల్లినా – మిమ్మల్ని హతమార్చి మీరక్తం తాగందే నిద్రపోనని ప్రతిజ్ఞ చేశాడు షాడో. ఒకమాట అంటే అది అక్షరాలా అమలు జరిగి తీరుతుందన్న విషయం మీకు తెలుసనే అనుకుంటాను."

రెండు క్షణాలు ఆలోచించాడు ఇబ్రహీమ్ – కాదని అంటే.... షాడో చేయగలిగింది ఏముంది? ప్రస్తుతం ఏమీ చేయలేక పోయినా.... ఇక తనను వదిలిపెట్టడు. కలల్లో కూడా ప్రత్యక్షమై పీడించుకు తింటాడు. వేటకుక్కలనైనా ఏమార్చవచ్చు గాని, అతన్ని ఏమార్చటం సాధ్యం కాదు. పోనీ, వారిని వదిలిపెట్టి.... షాడోతో ముఖా ముఖీన పోరాడితే!

తనకు పదిమంది సహచరులు తోడు ఉన్నారు. రైఫిల్స్ వున్నాయి. షాడో వంటరిగాడు.

"ఇబ్రహీం! తొందరపడకు..... షాడోని నమ్మటానికి వీలు లేదంటారు." అతని ఆలోచన విన్న అనుచరుడొకడు సలహా ఇచ్చాడు.

పిచ్చిగా నవ్వాడు ఇబ్రహీం.... ఎక్సైట్‌మెంట్ అతన్ని విలువనీయుటం లేదు..... షాడో! షాడో తలచూపితే చాలు..... తను వీరాధివీరుడైపోతాడు..... షాడో ఒక్కసారి తన ఎదుట పడితే.... అతని తలను తెగగొట్టటం ఎలాగో తనకు తెలుసు.

"ఫికర్ మత్ కరో! షాడో గురించి నాకు బాగా తెలుసు. అతన్ని గురించి నవల వ్రాయమన్నా వ్రాస్తాను.... ఆ ముసలాణ్ని – చిచోరీని వదిలిపెట్టండి" అని ఆజ్ఞ యిచ్చాడు తన సహచరులకు.

మసీదులో బంధించబడిన జీనత్, ఆమె గ్రాండ్ ఫాదర్ బయటికి వచ్చారు. వారు మసీదు మెట్లు దిగగానే సహచరులను హెచ్చరించి, రివాల్వర్‌ని కబురుతెచ్చిన వ్యక్తులకేసి గురిపెట్టాడు ఇబ్రహీం.

"షాడో వచ్చేదాకా మీరు అతనికోసం సిద్ధం చేసిన బోటులో కూర్చోండి. షాడో రాకపోతే మీ ప్రాణాలు బలి పుచ్చుకుంటాను" అని అరిచాడు.

జీనత్, జీనత్ కాకా ఇద్దరూ దూరంగా వెళ్ళిపోయారు. ఆ పల్లె వ్యక్తులు యిద్దరు రెండు అడుగులు ఎత్తున్న బోటు మీద కూర్చున్నారు.

ఇబ్రహీం గుండెలు కరాచీ ఎక్స్‌ప్రెస్ చేసినట్లు మోతలు చేస్తున్నాయి. అతని కళ్ళు సముద్రం తీరాన్నంతా గాలిస్తున్నాయి.

"కమాన్ షాడో.... ఆజావ్ తెరీ... బద్మాష్.... ఆజావ్ – అటో ఇటో తేల్చుకుందాం.... రాబే... సువ్వర్" అని తీవ్ర పడుతున్నది అతని అంతరంగం.

అతని అనుచరులు అందరూ ఆయుదాలు గట్టిగా పట్టుకొని రెడీగా నిలబడ్డారు. "రేయ్ షాడో..... రారా బాస్టర్డ్ .... రాబే" అని అరిచాడు ఇబ్రహీం.

బోటుమీదవున్న ఒకవ్యక్తి సిగిరెట్ వెలిగించుకోవటం అతనికి కన్పించింది.

రివాల్వర్ అతని బుర్రకేసి గురి పెడదామన్న కోపం ఇబ్రహీంని గజగజా లాడించి వేసింది.

ఈ సువ్వర్ కా బచ్చా.... తీరికగా వినోదం చూడటానికి వచ్చాడా? సిగిరెట్ పాకెట్‌ని చిరిగిపోయిన జేబులో పెట్టుకుంటున్నాడా వ్యక్తి. ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు. అతని పక్కనవున్న వ్యక్తి వెనక్కి దొర్లి బోటుచాటుకు పోయాడు.

"వచ్చాను బే.... ఈ షాడో దెబ్బ రుచి చూపించబోతున్నాను" అని అరిచాడు ఆ వ్యక్తి.

అప్రయత్నంగా రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కాడు ఇబ్రహీం. దాని బుల్లెట్ ఆ వ్యక్తి పాదాలుముందు యిసుక తెరలను సృష్టించింది.

ఒక అడుగు వెనక్కివేసి..... చొక్కా లోనుంచి పేపర్ చుట్టబడిన పార్శిల్‌ని బయటికి తీశాడతను. దాని చివర సిగిరెట్‌తో అంటించి గాలిలోకి విసిరేశాడు.

"ఫైర్!" అరిచాడు ఇబ్రహీం.

షాడో రానే వచ్చాడు.... దుర్మార్గుడు ఎదుటే నిలబడి నాటకం అడాడు. ఇబ్రహీం కళ్ళముందు.... ప్రపంచం గిర్రున తిరగటం ప్రారంభించింది. మసీదుమీది తుపాకులు గర్జించటం ప్రారంభించాయి.

కాని.... నిప్పులు వెదజల్లుతూ ఎగిరి వచ్చిందా పేపర్ పాకెట్. మసీదు మధ్యపడి చెవులు చిల్లులుపడే శబ్దంచేసింది. మసీదు పైకప్పు విరిగి చెల్లా చెదరైంది.

ఎగిరి పది అడుగుల దూరంలో పడ్డాడు ఇబ్రహీం. మసీదు నామరూపాలు లేకుండా పోయింది. అతని అనుచరులు అటూ ఇటూ చెల్లాచెదరైపోయారు. నల్లటి పొగ నుడులు తిరుగుతూ ఆకాశంలోకి లేచింది. పేపర్ పాకెట్లో వున్న డైనమైట్ ప్రేలిన మోత సముద్రంమీద భయంకరంగా ప్రతిధ్వనించింది. మసీదురాళ్ళు గాలిలోకి లేచాయి. ఒకరాయి వచ్చి ఇబ్రహీం.... మెడమీద తగిలింది బలంగా.

అయినా లెక్క చేయకుండా లేచాడు.... రివాల్వర్ ఎక్కడో జారిపోయింది. బూటు దగ్గిర నిలబడివున్నాడు షాడో.

ఈసారి అతన్ని చూసేసరికి ఇబ్రహీం నరాల్లోని రక్తం చల్లబడి పోయింది. కళ్ళముందు మెదిలిన టెక్నికలర్ కలలన్నీ కరిగిపోయేసరికి ఏడుపు వచ్చింది.

పిచ్చిగా అరుస్తూ పోయి ఎగిరి గుండెలమీద తన్నాడు. తన్నటానికి దెబ్బ తినటానికి షాడో అక్కడలేదు. క్రింద పడిన ఇబ్రహీం గుండెలమీద ఒకపాదం పడింది.

పైకి చూసిన ఇబ్రహీం కళ్ళకు తాపీగా సిగిరెట్ కాలుస్తున్న షాడో కన్పించాడు.

ఎక్కడో పోలీసు విజిల్స్ విన్పిస్తున్నాయి. పల్లెకు దూరంగావున్న రోడ్డుమీది పోలీసు బలగం.... షాడో విసిరిన బాంబ్ శబ్దం విని అక్కడికి వస్తున్నారు.

"నువ్వు వట్టి లఫూట్‌వి..." నిర్వికారంగా అన్నాడు షాడో.

తల వూపాడు ఇబ్రహీం.

"న్యాయంగా నిన్ను ముక్కలు ముక్కలుగా నరికి కాకులు గద్దలకు వెయ్యాలి." అందుకుకూడా తలవూపాడు ఇబ్రహీం. షాడో మాటలతో ఏకీభవించాడు పూర్తిగా.

"అయినా యీసారికి నిన్ను క్షమించి వదిలేస్తున్నాను. పోయి నీ బాస్‌కి చెప్పు. నన్ను బంధించి నానా హింసలూ పెట్టారు. పాకిస్థాన్ పోలీసులను రెచ్చగొట్టి నన్నో పిచ్చి కుక్కను తరిమినట్లు తరిమికొట్టిస్తున్నారు. ఎందుకులే అని వూరుకున్నాను. నన్ను వదిలిపెట్టి నా స్నేహితులను బంధించ పూనుకున్న మరుక్షణమే మీ పాపం పండింది. నిన్ను ఈ పనికి నియోగించిన నీ గాంగ్‌ని, నీ బాస్‌ని సర్వనాశనం చేయబోతున్నాను. తెల్లవారేలోగా వచ్చి పడతాను. పోయి చెప్పు. రిపోర్టు చెయ్."

నమ్మలేక పోయాడు ఇబ్రహీం.... షాడోని గురించి తనకు తెలియని విషయం ఇది. కన్పించిన శత్రువును ప్రాణాలతో వదిలిపెట్టడని అంటారు. మరి యిది ఏమిటి.

పోలీస్ వాన్... కనుచూపు మేరలోకి రావటం చూసి చటుక్కున లేచి పరుగు అందుకొన్నాడు ఇబ్రహీం. మసీదుకు కొద్దిదూరంలోనే అతని కారు పార్క్ చేయబడివుంది.

దాన్ని ఎక్కి వేగంగా అక్కడినుంచి దూసుకుపోయాడు రోడ్డును సమీపిస్తుండగా.... రోడ్డుమీది పోలీసు బలగం కన్పించింది. దాంతో ... మరో ఆశ అతనిలో మొలకెత్తింది.

మసీదులోని ప్రేలుడు పోలీసులకు ఆకర్షించింది. షాడో వారిని తప్పించుకోగలడా? తప్పించుకోలేడని సమాధానపడి తృప్తిపడింది అతని హృదయం. అయినా ఎక్కడో ఒక మూల చిన్న సందేహం మిగిలి వుండనే వుంది.

షాడోని గురించి ఎవరికి తెలుసు? ఏమో, తప్పించు కున్నా తప్పించుకోగలడు. ఆ సువ్వర్ కా బచ్చా, మనిషి కాదు. సైతాన్.

* * *

"సాబ్! పోలీసులు వచ్చేశారు!!" ఆందోళనగా అన్నాడు షాడో సహచరుడు.

బోటు చాటున కూర్చొని ఇబ్రహీమ్ కారు పోతున్న దిశకు చూస్తున్నాడు షాడో. తలతిప్పి కమ్మకు వస్తున్న పోలీసులను గమనించాడు. వారందరి దృష్టి మసీదు మీదే వుంది. బోటు చాటున వున్నవారిని ఇంకా గమనించలేదు.

"కమాన్! కొద్దిసేపు సముద్రంలో విహరించి వద్దాం" అంటూ వెనక్కి జరిగాడు షాడో. చల్లగా నీటిలోకి దిగి లోపలికి యీదుకుంటూ పోయాడు.

పోలీసు బృందం మసీదును చుట్టముట్టింది. బ్యాటరీ లైట్లు, సెర్చిలైట్లు ఆ ప్రదేశాన్నంతా గాలించి వదిలాయి. ముక్కలయిన మసీదు రాళ్ళు తప్ప వారికేమీ కన్పించలేదు. ప్రేలుడులో ఇబ్రహీమ్ అనుచరులు నలుగురు తీవ్రంగా తీవ్రంగా గాయపడ్డారు. వారుకూడా స్నేహితుల సాయంతో పారిపోయారు.

పల్లెలో వున్నవారిని నిద్రలేపి తరిచి తరిచి ప్రశ్నించారు పోలీసులు. తమకు ఏమీ తెలియదు పొమ్మన్నారు పల్లెకారులందరూ.

ఓ గంటసేపు హంగామాచేసి వెనుతిరిగారు పోలీసులు. రాళ్ళగట్టగా మారిన మసీదు దగ్గిరమాత్రం ఒక వాన్ నిలబడింది. వైర్లెస్ సెట్ని రెడీగా వుంచుకొని రివాల్వర్లను గట్టిగా పట్టుకోని షాడో వస్తే అంతు చూడటానికి రెడీగా కూర్చున్నారు అందులోని కానిస్టేబిల్స్.

* * *

వారికి కావాల్సిన షాడో...... వాన్కి ఫర్లాంగు దూరం అవతలగా వడ్డును చేరుకున్నాడు. ఒక పెద్ద చేపల పడవ చాటున కూర్చుని వారి హంగామా నంతా గమనిస్తూనే వున్నాడు.

ఆ పోలీసులు వెళ్ళపోగానే షాడోను కలుసుకున్నారు జీనత్. ఆమె కాకా "కాకా! మీరు ఇంటికి వెళ్ళిపోండి...... నేను ఇంకో రెండు రోజుల కరాచీలోనే వుండటానికి నిశ్చయించుకొన్నాను" అని చెప్పాడు షాడో.

"అందరూ కలిసే ఇంటికి వెళ్ళదాం" అన్నది జీనత్. ఇంత జరిగినా వారికి తనమీది అభిమాన తగ్గనందుకు ..... చలించిపోయాడు షాడో, జీనత్ భుజం మీద చెయ్యివేసి "బహెన్! నిన్నటిదాకా మీరెవరో నేనేవరో ఎవరికీ తెలియదు. నేను భారతీయుణ్ణి, పాకిస్థాన్కి శత్రువు అని తెలిసికూడా నన్ను దాచిపెట్టి నా ప్రాణాలు కాపాడారు. సోదరీ! పాకిస్థాన్లో మీలాంటి అమృత హృదయం ఇంకా అనేకమంది వుండివుండవచ్చు. మిమ్మల్ని బంధించిన క్రిమినల్ గాంగ్ లాంటి విద్రోహకర శక్తులు.... వారికి కూడా లేనిపోని కష్టాలు కల్పిస్తూ వుండివుండచ్చు. మీరు నాకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా.....యీ గాంగ్ని రూపుమాపే ప్రయత్నాలు చేస్తాను" అన్నాడు గంభీరంగా.

"అయితే మేము కూడా వస్తాం భయ్యా!" ఆత్రంగా అన్నది జీనత్. అవునని తలవూపాడు ఆమె కాకా.

తల అడ్డం తిప్పకుండా నవ్వాడు షాడో. "జీనత్ బహెన్! ఒకరికి సాయం చేయటానికి అలవాటుపడిన నీ బంగారు హస్తాలు..... సంఘవిద్రోహుల పాపిష్టి రక్తంతో మలినం కాకూడదమ్మా! ఆ పని చేయవలసింది నేను."

జీనత్ కళ్ళు చెమ్మగిల్లాయి. "పోయిరా భయ్యా! అల్లా అనుక్షణం నిన్ను కాపాడుతూ వుంటాడు" అన్నది ఆర్ద్రంగా.

కాకా దగ్గిరా, అతని స్నేహితుని దగ్గరా శలవు పుచ్చుకొని, ఇబ్రహీమ్ కారు పోయిన దిశకు అడుగులువేశాడు.

రోడ్డు సమీపంలో వందగజాల ఇవతలగా రెండు ఖర్జూర చెట్లు ఒకదాన్ని ఒకటి అనుకొని మొలిచివున్నాయి.

వాటి చాటున నిలబడి ఆకాశం వంక చూశాడు..... చలిగాలి ఆగిపోయింది. వర్షం మళ్ళీ మొదలుకావచ్చు. వేటకుక్కలు వర్షంలో దారిని గుర్తుపెట్టుకోగలవా?

* * *

"నువ్వు పన్నిన వలనుంచి తప్పించుకొని పారిపోయాడన్నమాట! మనల్ని సర్వనాశనం చేస్తానని వార్నింగ్ పంపించాడన్నమాట! చేతకాని దద్దమ్మలా షాడో చేతిలో చావు దెబ్బలు ఆ హెచ్చరికను వినిపించటానికి పారిపోయి వచ్చావన్నమాట!!" ముసుగుకున్న రంధ్రాలనుంచి సీరియస్‌గా చూస్తూ అన్నాడు బాస్.

ఎదురుగా నిలబడిన ఇబ్రహీం గుటకలు మింగాడు.

"బాస్! ఆ పల్లెలో షాడోకి స్నేహితులు చాలామంది వున్నారు. అందువల్ల నా ప్లాను ఫెయిల్ అయింది."

"ఆల్ రైట్! అక్కడినుంచి ఎలా వచ్చావ్?"

"నా కారులో పారిపోయి వచ్చాను బాస్."

"నువ్వు రావటం ఎవరు చూశారు? నిన్ను ఎవరైనా అనుసరిస్తున్నారేమో గమనించావా?" క్షణకాలం తటపటాయించాడు ఇబ్రహీం, కొంపతీసి షాడో తనను అనుసరించి రాలేదు కదా'

తన కారు రోడ్డు ఎక్కుతున్న సమయంలో కనిపించు పోలీసు బృందాలు మనస్సులో మెదిలి ధైర్యం తెచ్చుకున్నాడు.

"లేదు బాస్! ఎవరూ రాలేదు. జాగ్రత్తగానే వచ్చాను" సమాధానం యిచ్చాడు నమ్మకంగా.

రెండు నిముషాలు.... సూటిగా అతనివంకే చూశాడు బాస్... ఆ నిశ్శబ్దం ఇబ్రహీంకి భయం కలిగించింది. తుఫాను వస్తున్నదనటానికి సూచన అది....

డ్రాయర్ తెరచి – చిటికెన వేలంత లావున వున్న కొబ్బరి త్రాటిని ఇబ్రహీం ముందు పడవేశాడు బాస్.

"ఇదేమిటో, ఎక్కడనుంచి వచ్చిందో తెలుసా?" అని ప్రశ్నించాడు.

ఇబ్రహీంకి అర్థం కాలేదు.... గట్టిగా లాగితే తెగేటట్లుంది ఆ తాడు.... ఎక్కడి నుంచి వచ్చింది? తనకు దానికి సంబంధం ఏమిటీ?

"పోయి నీ కారు వెనక సీటును చూసి రా.... అర్థం అవుతుంది." ఆజ్ఞ యిచ్చాడు బాస్.

పరుగు పరుగున బయటికి వచ్చాడు ఇబ్రహీం. వెనుక తలుపు తెరిచి తొంగి చూశాడు.

సీటు క్రింది భాగానికి... బాస్ చూపించిన త్రాడు లాంటిది మరో చిన్న ముక్క బిగించి వుంది. దాని రెండవ కొస ఎవరో కొరికి తెంపినట్లు నలిగిపోయి వుంది.

"ఇబ్రహీం! ఫతేపూర్‌లో షాడోని కార్నర్ చేసిన మన మనుషులు.... ఒక కుక్కపిల్లకు బెదిరి అతన్ని వదిలి పెట్టారు.... ఇప్పుడు అదే కుక్కపిల్ల మన స్థావరాన్ని చూసి పారిపోయింది. ఈ సరికి షాడో దగ్గిరికి వెళ్ళివుంటుంది....

నీ అజాగ్రత్తవల్ల మన స్థావరపు రహస్యం షాడోకి తెలిసిపోయింది. అందుకు తగిన ప్రతిఫలం అనుభవిస్తావ్ నువ్వు. ముందు షాడో సంగతి చూసుకొని, ఆ తర్వాత నీ విషయం ఆలోచిస్తాను." అంటూ చిటికెలు వేశాడు ఇబ్రహీం వెనకాలే బయటికి వచ్చిన బాస్.

వెంటనే నలుగురు దృఢకాయులు ఇబ్రహీంని బంధించారు. "బాస్!బాస్!! ఈ ఒక్కసారికి క్షమించండి.....ఈ ఒక్క తప్పు కాయండి....." అని అరుస్తున్నా లెక్కచెయ్యకుండా లాక్కుపోయి ఒక గదిలో పెట్టి తాళం వేశారు.

"గెట్ రెడీ.... షాడో ఏ క్షణంలోనైనా రావచ్చు. రాగానే ఎదుర్కోవాలి. అందరూ సిద్ధంగా వుండండి......" అని ఆర్డర్లు యిచ్చి లోనికిపోయాడు వారి బాస్.

నిశ్శబ్దంగా.... గోడల చాటునా..... పొదల చాటునా నిలబడ్డారు అతని అనుచరులు.... అందరూ షాడో రాక కోసం ఎదురు చూడసాగారు – ఆయుధాలను రెడీగా పట్టుకొని.

* * *

ఎంతోసేపు వెయిట్ చెయ్యాల్సి వస్తుందని అనుకున్నాడు షాడో. కాని అరగంట గడిచేసరికి... రోడ్డుకు క్రాస్ చేసి అటు పరుగెత్తుకు వస్తున్న కుక్కపిల్ల కనిపించింది.

సూటిగా మసీదు వైపు పోతున్నదది..... దగ్గిరికి రాగానే విజిల్ వేశాడు షాడో. చిన్నగా అరుస్తూ..... కిందపడి దొర్లుతూ వచ్చి అతని కాళ్ళమీదికి ఎగబ్రాకిందది

"శహభాష్ బేటా!... నీ జాతి పేరును నిలబెట్టావ్" దాని చెవులు నులుముతూ మెచ్చుకున్నాడు షాడో.

ఇబ్రహీంని కలుసుకునే ముందు అతను ఎక్కివచ్చిన కారును గమనించి జాగ్రత్తగా సోదా చేశాడు. కుక్కపిల్ల శక్తిమీద మంచి నమ్మకం ఏర్పడటంవల్ల చిన్నప్లాను వేశాడు. మసీదులో నుంచి పారిపోవటం ప్రారంభించిన గాంగ్ మనుష్యులు స్థావరానికే చేరుకుంటారు.

వంటరిగా కారులో వదిలితే అది ఆగదు. కిందికి దూకి పారిపోయి వస్తుంది.

అందువల్ల చిన్న కొబ్బరి తాటితో దాన్ని సీటుకు బంధించాడు. ఇబ్రహీం స్థావరాన్ని చేరుకునే సమయానికి త్రాటిని కొరికి బంధాలను వదిలించుకున్నదది.

కారు ఆగిగానే విండోలోనుంచి కిందికిదూకి సముద్రం వడ్డుకు పారిపోయి వచ్చింది. డోబర్ మాన్ జాతి కుక్కలకు వుంచే సెన్స్ ఆఫ్ డైరెక్షన్ దానికి దారి చూపించింది.

కుక్కపిల్ల కారులో నుంచి దూకి పారి పోవటాన్ని గమనించిన కొందరు గాంగ్ అనుచరులు చల్లగా బాస్కి రిపోర్టు చేశారు. ఆ సంగతి తెలియని ఇబ్రహీం చిక్కులో పడ్డాడు.

కుక్కపిల్లను మృదువైన మాటలతో మురిపిస్తూ రోడ్డు మీదికి వెళ్ళాడు షాడో. అక్కడ కాన్వాస్ గుడ్డతో మూసిన నాలుగు లారీలు నిలబడివున్నాయి. ఒక్కొక్క లారీలోను పాతికమంది రిజర్వ్ కానిస్టేబిల్స్ వున్నారు. వారందరూ కునికిపాట్లు పడుతూ – షాడో కనిపిస్తే బంధించటానికి కాపలాగా వున్నారు ఆ ప్రదేశానికి.

లారీల పక్కను నిలబడి బీడీలు కాలుస్తూ కబుర్లు చెప్పు కుంటున్నారు. మరికొంతమంది. ఆకాశంవైపు చూశాడు షాడో. మరో పదిపదిహేను నిముషాలలో వర్షం మొదలుకావచ్చు. గాలి పూర్తిగా బిగదీసుకుపోయి వుంది.

రోడ్డుమీది పోలీసులు కళ్ళు కప్పి అవతలకు పోవటం ఏమంత కష్టంకాదు. కానీ యీ లోపల వర్షం రావచ్చు వర్షం. వస్తే కుక్కపిల్ల దారిని గుర్తుపట్టలేక పోవచ్చు. అదీ కాక తనకు ప్రస్తుతం ఒక వాహనం కావాలి. ....తన ఆలోచనకు సరిపోయే బరువైన వెహికల్.... జస్ట్.... పోలీసు లారీ లాంటిది......

జీనత్, జీనత్ కాకాలను విడిపించటానికి పది పౌండ్ల డైనమైట్‌ని సంపాదించుకు వచ్చాడు షాడో. అందులో మసీదును పడగొట్టటానికి ఎనిమిది పౌండ్లు సరిపోయింది. మరో రెండు పౌండ్లు పాకెట్ చొక్కాలోపలే వుంది.

సిగిరెట్ పాకెట్ తీసి ఒక సిగిరెట్ వెలిగించుకున్నాడు. కుక్కపిల్లను కాళ్ళమధ్యన నొక్కి పట్టివుంచి, డైనమైట్ పాకెట్‌ని అంటించి లారీలకు వంద అడుగుల దూరంలో రోడ్డుమీద పడేటట్లు విసిరాడు.

ధన్ మంటూ పేలిందది, రోడ్డు మీద రెండు అడుగుల లోతున గొయ్యి ప్రత్యక్షమయింది.

లారీలు పక్కనవున్న పోలీసులు ఆ అదటుకు ఎగిరి అవతల పడ్డారు. లారీలు పది ఆంగుళాల ఎత్తుకు జంప్ చేసి.... నిలబడ్డాయి. వాటిల్లోని వీరులందరూ రైఫిల్స్ పట్టుకొని బిలబిలా కిందికి దూకారు....

"పకడో – భాగ్ జారారే! షాడో భాగ్ జా రహా హై" పెద్దగా గొంతు చించుకొని అరిచాడు షాడో.

లారీలను వదిలి ముందుకు పరుగులు తీశారు వారందరూ. గందరగోళం అరంభమయింది ఆ ప్రదేశంలో. అందరూ – ఎవరికి వారు షాడోని పట్టుకొవాలన్న పట్టుదలతో లారీలను వదిలి యివతలికి వచ్చారు.

చల్లగా రోడ్డును క్రాస్ చేసి.... ఒక లారీని సమీపించాడు షాడో. స్టీరింగ్ ముందు కూర్చుని.... బీడీ కాలుస్తున్న డ్రయివర్ విసుగ్గా చూశాడు షాడో వంక.

"ఛల్ బే సాలే....." విసుగ్గా తిట్టాడు షాడో తనని కిందికి దిగమని సూచించటం గమనించి.

"కిందికి దిగండి సాబ్! సార్జెంట్ సాబ్ మిమ్మల్ని పిలుస్తున్నారు....." అంటూ టైరు మీద కాలువేసి పైకి లేచాడు షాడో.

"తూత్ తెరీ!" షాడోని, సార్జెంట్‌నీ అడ్డమైన తిట్లు తిట్టాడు డ్రయివర్.

"నా డ్యూటీ లారీని నడపటం.... నీడల్ని వెంటాడటం కాదు. ముందు ఇక్కడి నుంచి పోతావా లేదా?" అంటూ షాడో గుండెలమీద చెయ్యివేసి కిందికి తోశాడు.

ఉన్న వారిలో అతనోక్కడే కాస్త విచక్షణా జ్ఞానం కలవాడు. అతన్ని తెలివిగా వుంచితే ఆ తర్వాత లేనిపోని రగడ మొదలు కావచ్చు.

ఇనుప చువ్వలా లేచింది షాడో చేయి.... బలంగా అతని మెడమీద పడింది. మరుక్షణం స్పృహతప్పి స్టీరింగ్ మీదపడి పోయాడతను. జాగ్రత్తగా ఎత్తి రోడ్డుకు అవతలగా పడుకోబెట్టాడు షాడో.

కుక్కపిల్లను సీటు మీదికి తోసి లారీ ఎక్కి కూర్చున్నాడు.

కింద వున్న కానిస్టేబుల్స్ అందరూ రోడ్డుకు రెండు వందల గజాల దూరంలో ఇసుక గుట్టల్ని గాలిస్తున్నారు షాడో కోసం.

లారీని స్టార్ట్ చేసి రివర్స్ చేశాడు షాడో.... ఇబ్రహీం వెళ్ళిన దిశ గుర్తుపెట్టుకొని వుండటం వల్ల పెద్దగా ఆలోచించకుండా అటువైపు పోనిచ్చాడు.

మొదట అంతగా అనుమాన పడలేదెవరూ. కాని లారి కనుచూపు మేరదాటి పోగానే కలకలం చెలరేగింది. మిగిలిన లారీలలో వున్న వైర్‌లెస్ సెట్ వైపు పరుగులు తీయటం మొదలు పెట్టారందరూ.....

* * *

“కమాన్ బేబీ...... షో మీ ది వే...... దారి చూపించు.... “ కుక్కపిల్ల చెపులు నులిమి ముందుకు చేయి చూపించాడు షాడో.

మొదలు దానికి అర్థంకాలేదు. కాని రెండుసార్లు లారీని ఆపి దానివంక ప్రశ్నార్థకంగా చూశాడు షాడో.

నెమ్మదిగా అర్థం చేసుకున్నదది..... వెంటనే కిందికిదూకి రోడ్డుమీద పరుగుదీయటం ప్రారంభించింది. దానివెనుకే లారీ పోనిచ్చాడు షాడో.

అరగంట తరువాత ఒక పోలీస్ బ్లాకేడ్ కనిపించింది. వార్తలు అందాయి కాబోలు.... రోడ్డుకు అడ్డంగా నిలబడి వున్నారు పాతికమంది రిజర్వ్ పోలీసులు.

కుక్కపిల్లను పిలిచి లారీలో ఎక్కించాడు షాడో. యాక్సిలేటర్ ని తొక్కిపట్టి అతి వేగంగా లారీని ముందుకు దూకించాడు......

“ఖడ్ జావ్!!” అరిచారు పోలీసులు..... ఆగలేదు షాడో. అలాగే రెక్‌లెస్‌గా ముందుకు తీసుకు పోయాడు లారీని.

రోడ్డుపక్క నుంచి రెండు రైఫిల్స్ గర్జించటం ప్రారంభించాయి. భూతంలా వస్తున్న లారీనిచూపి భయపడి రోడ్డుమీది నుంచి పక్కకు గెంతారు అందరూ రోడ్డు మీద ఇసుక మూటలను కూడా అడ్డు పెట్టి వుంచారు వాటిని చూపి మరింత వేగం పెంచాడు షాడో.

బంపర్ తగిలి నాలుగు మూటలు చెల్లా చెదరైనాయి.

మరో నాలిగింటి మీదుగా అవతలిపోయింది కుడివైపు చక్రం. లారీ తల్లకిందు లౌతుందా అనిపించేటట్లు పక్కకు వరిగి ఆఖరి క్షణంలో సర్దుకుంది.

"ధన్ ధన్ ధనా ధన్" అంటూ వెనుక భాగాన్ని తూట్లు పొడుస్తున్నాయి రైఫిల్ బుల్లెట్లు లెక్క పెట్టకుండా ముందుకే పోయాడు షాడో. ఒక మలుపు తిరిగి.... లారీని రోడ్డు క్రిందికి పోనిచ్చి ఇంజన్ ఆఫ్ చేశాడు.

రెండు నిముషాలలో షాడో వూహించినట్లే పది పోలీసు వాన్‌లు అతి వేగంగా అటు దూసుకు వచ్చాయి. రోడ్డు క్రింది లారీని వారు చూడలేదు. వారి చూసంతా ముందు ఉన్నది.

వారిని ముందుకు పోనిచ్చి వెనుక బయలు దేరాడు షాడో. రెండు ఫర్లాంగులు కూడా పోకముందే..... మరో రెండు లారీలు ఆ వూరేగింపులో పాల్గొన్నాయి..... అవి షాడో నడుపుతున్న లారీ వెనుక ప్రయాణించాయి.

ఒక మలుపు తిరుగుతుండగా కుక్కపిల్ల గుర్రుమనటం గమనించి పక్కకు చాశాడు షాడో అది చూస్తున్న దిశలో ఒక మట్టిరోడ్డు వుంది.

లారీని పక్కకు పోనీయటానికి వీలులేదు. వెనుక వస్తున్న లారీలకు అనుమానం కలుగుతుంది.

ఆ మట్టిరోడ్డును జాగ్రత్తగా పరిశీలిస్తూ ముందుకే పోయాడు షాడో. పోలీసులతో కలిసి నాలుగు రోడ్లను కలియ తిరిగాడు. పావుగంట తరువాత ఏవో అర్డర్లు యివ్వబడ్డాయి కావోలు.... ఒక్కొక్కలారీ.... ఒక్కొక్క సందు ముందు ఆగటం ప్రారంభించింది.

ఇక ఆ వూరేగింపులో వుండకూడదని గ్రహించి వేగంగా మరో సందులోకి లారీని తిప్పాడు షాడో.

ఎవరో ఏదో అరవటం, వినిపించింది.... ఏమిటో సరిగా అర్థం కాలేదు. సందులోనుంచి రోడ్డు మీదికి వచ్చి..... వేగంగా మట్టి రోడ్డును సమీపించాడు.

కుక్క పిల్ల సీటుమీద ఎగిరెగిరి పడసాగింది. తోకను నిఠారుగా ఎత్తి అరవటం ప్రారంభించింది.

దాని ఎక్సైట్‌మెంట్ షాడోని కూడా అవరించుకుంది. యాక్సిలేటర్‌ని అడుగుకంటా నొక్కిపట్టి లారీని ముందుకు దూకించాడు.

మట్టిరోడ్డు.... ఒక పెద్ద కాంక్రీట్ భవంతి ముందు అంతం అయింది. దూరం నుంచే పోర్టికో ముందు వున్న పది కార్లను గమనించగలిగాడు షాడో.

వాటిలో.... తను కుక్కపిల్లను బంధించిన గాంగ్ కారును గుర్తుపట్టగలిగాడు. ఆ పైన ఆలోచించవలసిన అవసరం లేకపోయింది.

కుక్కపిల్ల వాలకం.... గాంగ్ స్థావరం అదే అని సూచిస్తోంది.

దాని ఇన్‌స్టింక్ట్ మీద అపరిమితమైన గురి ఏర్పడిన కారణంచేత.... ఏ మాత్రం వేగాన్ని తగ్గించుకుండా గేటును సమీపించాడు షాడో.

బంపర్ దెబ్బకు గేటుఎగిరి అవతల పడిపోయింది. లారీ పెనుభూతంలా అవరణలోకి ప్రవేశించింది.... దగ్గిరలో వున్న ఒక కారును బలంగా గుద్దుకుంది. గాలిలోకి లేచిందా కారు..... ముందున్న నాలుగు కార్లు..... అడ్డం తిరిగాయి.......

ఆవరణ వెనుక నుంచి.... పొదల చాటు నుంచి..... అరుపులు విన వచ్చాయి. ఒక్కసారిగా రైఫిల్స్.... మిషన్ గన్స్ అన్నీ..... నిప్పులు కక్కటం ప్రారంభించాయి.

బ్రేకు వేసి లారీని ఆపాడు షాడో. రివర్స్ చేసి పొదల మీదికి పోనిచ్చాడు. తల మీది నుంచి, చెవుల పక్కనుంచి పోతున్న బుల్లెట్లును లక్ష్య పెట్టకుండా ముందుకు పోనిచ్చి పోర్టికోలోని కాంక్రీట్ స్తంభానికి గుద్దించాడు.

భవనం భూకంపం వచ్చినట్లు చలించి పోయింది బంపర్ విరిగి పోయింది. ఇంజన్ పాడై పోయింది.

తలపు తెరుచుకొని కిందికి దూకాడు షాడో. తల నుంచి.... కార్ల చాటుకు పరుగు తీశాడు.

"పట్టుకొండి.... చంపండి...." అని అరుస్తూ పొదల చాటు నుంచి యివతలికి వచ్చారు కొంతమంది.

షాడో అదృష్టదేవత.... తిరిగి పంచకల్యాణి గుర్రాన్ని అధివసించింది. ఒక్కసారిగా వర్షం ప్రారంభమయింది.

కుండపోతగా కురవటం సాగించింది. సైకలాజికల్‌గా..... ఎఫెక్ట్ వచ్చింది ఆవరణలో వున్న వారిలో – ఎవరికివారు పదిక్షణాల సేపు తల దాచుకునే ప్రదేశం కోసం చూశారు.

షాడో నేర్పుగా వినిమోగించుకున్నాడా వ్యవధిని.... ఒక పొదచాటుకు పోయి అక్కడున్న ఆగంతకుణ్ని....ఒకే ఒక దెబ్బతో మట్టి తినిపించి, అతని రైఫిల్‌ని స్వాధీనం పరుచుకున్నాడు....

ఆ మరుక్షణం...... దాఋణమైన ధ్వనులతో దద్ధరిల్లిపోయింది ఆ ప్రదేశం....

చీకటి.... దానికితోడు కుంభవృష్టి.... తమ మధ్యనుంచి కాల్పులు వినిపించటం.... ఎవరు ఎవరో ఎవరికీ అర్థం కాలేదు.

ఆర్డర్లు యిచ్చేబాస్ బయటికి రాలేదు.... రెండు నిముషాల్లో ఆవరణ ఖాళీ అయింది..... ఎవరికి వారు తమకు తోచిన దిక్కుకుపారిపోయారు.

ఖాళీ అయిన రైఫిల్‌ని అవతల పడవేసి.... దగ్గిరలో కనిపించిన మరో మిషన్ గన్‌ని అందుకున్నాడు షాడో.

వర్షపు నీళ్ళలో తడిసిపోయిందది .......పని చేస్తుందో చేయదో!! ఏదో ఒక ఆయుధం చేతిలో వుంటే చాలని అనుకుంటూ ముఖద్వారం వైపు అడుగులు వేశాడు.

* * *

షాడో వచ్చినా రాకపోయినా తన పని అయిపోయింది అన్న నిర్ణయానికి వచ్చి.... ప్రాణాల మీద ఆశ వదులు కున్నాడు ఇబ్రహీం.

విధి ఎంత విచిత్రమైనదో అతనికి అప్పుడు బాగా అనుభవంలోకి వచ్చింది. పాకిస్థాన్ ఏరియాకు అధిపతి కావాల్సిన తను.. దిక్కులేని చావు చావబోతున్నాడు..... ఇంత కాలం విశ్వాసంగా సేవ చేశాడు గాంగ్‌కి .... ఒక్క తప్పుతో.... ఆ విశ్వాసానికి అర్థం లేకుండా పోయింది.

తన సేవలకు విలువ యిస్తున్నారే కానీ.... తనను గురించి పట్టించుకోవటం లేదెవరూ అటువంటి వారితో చేతులు కలపటం తనది తప్పు.... అసలు ఇటువంటి అడ్డు దార్లు తొక్కటమే పెద్ద తప్పు....

ఇంటి వద్ద తనకోసం ఎదురు చూస్తూవుండే భార్యా, పిల్లలు గుర్తుకు వచ్చి ఇబ్రహీం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వద్దు..... పాడు పనులు చేయద్దు అని ఏడ్చి రాగాలు పెట్టి బ్రతిమిలాడేది తన భార్య... ఆమె మాటలు వినిపించుకున్నాడా తను? విరగ బాది, తిట్టి, నరికి పోగులు పెడుతూ వుండేవాడు.....

అందుకు శాస్తి జరగబోతోంది ఇప్పుడు.....

ఉన్నట్లుండి భవనం ముందు కలకలం చెలరేగటం వినవచ్చింది. రెండు క్షణాల్లో అది ఏమిటో అర్ధంఅయింది. అప్రయత్నంగా ఝల్లు మన్నది ఇబ్రహీం శరీరం.....

షాడో! షాడో వచ్చినట్లున్నాడు!!

సుడిగాలి ఆ ప్రాంతాన్ని అవరించుకొని వున్నప్పుడే తను పారిపోవటానికి ప్రయత్నిస్తే?

చేతులకున్న తాళ్ళు గదిలోకి వచ్చినప్పటి నుంచీ ప్రయత్నిస్తూ వుండటం వల్ల లూజ్ అయ్యాయి. రెండు నిముషాల్లో వాటిని వదిలించుకొని.... తలుపులను పరీక్షించాడు. బయట తాళంవేసి వున్నాయి.

ప్రాణాలకు తెగించి.... భుజంతో వాటిని బలంగా మోదాడు.... నాలుగు దెబ్బలకు విరిగి అవతల పడి పోయాయవి....

తల్లకిందులుగా బయటికి వచ్చి పడ్డాడు ఇబ్రహీం..... కళ్ళు బైర్లు క్రమ్మాయి... అలాగే పెదవులు బిగించి లేచి నిలబడ్డాడు.... మసకలు కమ్మిన కళ్ళముందు కాలయముడిలా నిపించాడు షాడో.

గొంతు తడి ఆరిపోయి.... రాతి బొమ్మలా నిలబడియాడు ఇబ్రహీం.

* * *

"హల్లో! మళ్ళీ ఎవర్నైనా కిడ్నాప్ చేసి వుంచావా?" నువ్వుతూ అన్నాడు షాడో.

ఇబ్రహీం..... కళ్ళల్లో నీళ్ళు మొలిచాయి.... ఏదో అనబోయాడు. నోటివెంట మాటరాలేదు.

భవనమంతా గాలించి వస్తున్నాడు షాడో. భవనంలో అతనికి ఎవరూ కనిపించలేదు. అందరూ పారిపోయారు.

గాంగ్‌కి సంబంధించిన రికార్డులుకూడా వారితోపాటు మాయం అయపోయాయి.

"షాడో! ఇప్పుడు నేను గాంగ్‌కి పనికిరాని వాణ్ణి.... నిన్ను పట్టుకోలేక పోయానని... నాకు శిక్ష విధించబోతున్నాడు బాస్....." అతి ప్రయత్నంమీద గొంతు పెకలించుకు అన్నాడు ఇబ్రహీం.

యదాలాపంగా అతని మాటలు విన్నాడు షాడో..... దూరంగా పోలీసులు వస్తున్నాట్లు విజిల్ మోతలు.... పైరన్లు వినిపిస్తున్నాయి.

అదే సమయంలో మేడ పై భాగంలో నుంచి కుక్కపిల్ల అరుపులు వినవచ్చాయి. షాడోతోపాటు భవనమంతా కలియతిరుగుతున్నదది..... దానికి కుతూహలాన్ని కలిగించిన విషయం ఏదో కనిపించినట్లుంది –

"ఇబ్రహీం...... నాకో చిన్న సాయంచేస్తే ....నీ ప్రాణాలకు ఎటువంటి భయమూలేదు" అన్నాడు షాడో.

ఇబ్రహీం ముఖం ఒక్కసారిగా వికసించింది. "ఏమిటి?" అన్నాడు.

"గాంగ్ పారిపోయింది... మీ బాస్‌లు తప్పుకున్నారు. ఎక్కడ దొరుకుతారు?" సూటిగా అడిగాడు షాడో.

వేగంగా ఆలోచించాడు ఇబ్రహీం...... గాంగ్ తనకు మేలుచేస్తే తను విశ్వాసం చూపించటంలో అర్థం వుంది. ఇంత జరిగిన తర్వాత కూడా యిక గాంగ్‌ని గురించి తన కెందుకు?

"ఆల్‌రైట్..... అలాగే చూపిస్తాను" అన్నాడు.

పైనుంచి కుక్కపిల్ల అరుపులు తారాస్థాయిలో వినవస్తున్నాయి.

"ఒక్కక్షణం" అంటూ పైకి పరుగుతీశాడు షాడో. మేడ పైభాగంలో ఒక మూలగా చిన్న గది వుంది. ఆ గది ముందు నిలబడి గంతులు వేస్తోంది కుక్కపిల్ల. మిషన్ గన్ తో గది తాళాన్ని పగలకొట్టి తలుపులు తెరిచాడు షాడో.

కరెంట్ షాక్ కొట్టినట్లు వులిక్కిపడి తల విదిలించాడు.

* * *

థండర్ బర్డ్ యువతి దౌలత్ ఆమె సహచరుడైన మధ్య వయస్కుడు..... ఆ గదిలో బంధింపబడి వున్నారు.

"హల్లో మిస్టర్ షాడో!!" నవ్వుతూ పలకరించాడతను.

"మీరు యిక్కడకు ఎలా వచ్చారు?" వారి బంధనాలు పడలిస్తూ అడిగాడు షాడో.

"మిస్టర్ షాడో! నిన్ను అనుసరించివచ్చి వీరికి చిక్కుపడ్డాం...." జవాబు యిచ్చింది దౌలత్.

"మిస్టర్ షాడో..... ఆనాడు నీ ప్రశ్నలకు జవాబులు యిచ్చే అధికారం మాకు లేకపోవటంవల్ల యిన్ని బాధలు పడవలసి వచ్చింది. మిస్టర్ షాడో.... ప్రభుత్వం యంత్రాంగంలో అతి ముఖ్యులైన కొంతమంది మమ్మల్ని యీ పనికి నియోగించారు. ప్రభుత్వ వైఖరి వారికి నచ్చలేదు. కాని ఎదురుచెప్పటం న్యాయంకాదు. అందువల్ల తమ పేర్లు బయటకి రాకుండా నిన్ను కంటాక్ట్ చేసి అల్లర్లు సాగిస్తున్న యీ గాంగ్ అంతు చూడాలని వారి ఆకాంక్ష..... ఏమంటావ్ షాడో.... మాకు సాయం చెయ్యలేవా ?" అని అడిగింది.

"ఇంకెక్కడి సాయం? అంతా అయిపోయింది. పోలీసులు బిల్డింగ్ ని చుట్టుముట్టేశారు..... తలుపులు మూసివచ్చాను.. అని పగలగొడుతున్నారు" అప్పుడే పైకివచ్చిన ఇబ్రహీం అన్నాడు.

దౌలత్ వంక సాభిప్రాయంగా చూశాడు షాడో.

"ఒక్కక్షణంలో అంతా సరిచేస్తాను" అంటూ కిందికి పరుగుతీసింది దౌలత్. కింది అంతస్థులో వున్న టెలీఫోన్‌ని డయల్ చేసి ఎవరితోనో మాట్లాడింది. ఆమె మాటలు పూర్తి కావటం.... తలుపులు విరగగొట్టి పోలీసులు లోపలికి కావటం ఒకేసారి జరిగాయి.

* * *

"అదే మా గాంగ్ ముఖ్యస్థావరం.... పాకిస్థాన్‌లో వున్న బ్రాంచీలు, గాంగ్ నడుపుతున్న వ్యాపార కేంద్రాలు వాటి వివరాలు అన్నీ అక్కడే వుంటాయి. అండర్‌గ్రాండ్‌లో పెద్ద వాల్టువుంది. గాంగ్‌కి చెందిన ధనమంతా అందులోనే వుంటుంది."

కరాచీకి వందమైళ్ళ దూరంలోవున్న చిన్న పర్వతం మీది భవనాన్ని చూపిస్తూ అన్నాడు ఇబ్రహీం.

అతని పక్కనే నిలబడి బైనాక్యులర్స్‌లో ఆభవనాన్ని పరిశీలించాడు షాడో. ఒకరు యిద్దరుపోయి భవనాన్ని స్వాధీనపరుచుకోవటం అసంభవం.... కొండను సమీపిస్తుండగానే కనిపెట్టేస్తారు శత్రువులు.

దౌలత్ ఎవరితో మాట్లాడిందో షాడోకు తెలియలేదు. కాని వారికి అధికారం చాలా ఎక్కువ స్థాయిలో వున్నదని వెంటనే తెలిసింది.

దౌలత్‌ని నిర్బంధించి మేడ మీదికి రాబోయిన పోలీసులు.... మెట్లమధ్యలో వుండగానే ఒక వైర్‌లెస్ మెస్సేజి వచ్చింది..... అది విని వారందరూ భవన్నాన్ని వదిలిపెట్టి దూరంలో వెళ్ళిపోయారు.

మొట్టమొదటిసారిగా దౌలత్ ఎంప్లాయర్స్ తో మాట్లాడాడు షాడో.

“మిస్టర్ షాడో.... దౌలత్ బంధింపబడటం వల్ల మాకు నీ విషయాలు తెలియలేదు. మాకు ఏ విషయమూ వివరంగా తెలియక పోవటంవల్ల పోలీసులు నిన్ను బంధించటానికి కరాచీని బిగించేస్తుంటే మౌనం వహించాము. దౌలత్ నీకు అన్ని విషయాలు చెప్పేవుంటుంది–” అని మౌనం వహించాడు ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి.

మాకు సాయం చేయగలవా..... అన్న మాట వుచ్చరించటానికి వారు సిగ్గుపడుతున్నారని గ్రహించి నవ్వుకున్నాడు షాడో. వప్పుకున్నాడు వారి మాట వినటానికి.

కరాచీ క్లియర్ చేయబడింది వెంటనే షాడో కోసం అన్వేషిస్తున్న పోలీసు బలగాలు వుపసంహరించబడ్డాయి.

ఆ రోజు సాయంత్రమే ఇబ్రహీం షాడోని, దౌలత్‌నీ తమ గాంగ్ ప్రధాన స్థావరానికి తీసుకుపోయాడు.

"దౌలత్! అక్కడ లభించబోతున్న ధనంలో కొద్దిపాటి మొత్తం ఇబ్రహీంకి యిప్పించగలవా?" దౌలత్‌ని అడిగాడు షాడో.

"తప్పకుండా...." అన్నదామె.

తలవూపి "ఆల్‌రైట్.... పిలిపించు......" సమ్మతిని తెలియ చేశాడు షాడో. భుజానికి వేలాడతీసుకున్న మైక్రోఫోన్‌లో ఆర్డర్లు యిచ్చింది దౌలత్.

పది నిముషాల అనంతరం.... పది బాంబర్ విమానాలు..... శరవేగంగా అటు దూసుకువచ్చాయి.

జాలి దయ చూపించటం పాకిస్థాన్ ప్రభుత్వానికి ఎప్పుడూ అలవాటులేదు.

పదిక్షణాలలో ముక్కలు ముక్కలై పోయింది పర్వతం మీది భవనం.... ఎగిరిపడుతున్న ఆ బాంబుల ధాటికి తట్టుకోలేక హతమారి పోయారు అక్కడివారు. భవనాన్ని అక్రమించుకుంది దౌలత్ పిలిపించిన మిలటరీ బెటాలియన్ ఒకటి. వాల్టులో కనిపించిన నోట్లకట్టలలో రెండింటిని.... ఇబ్రహీంకి యిచ్చింది దౌలత్.

షాడో కోసం వెతికాయి ఆమె కళ్ళు.

ఎక్కడ వుంటాడతను?

“లాభం లేదు మేం సాబ్.... పని అయిపోయిన తర్వాత ఒక్క క్షణం కూడా వుండదు ఆ షాడో.... విమానంలో నుంచి ఎగిరివచ్చిన బాంబును గమనించారు. నేలను తాకేదాకా అది పేలదు..... నేలను తాకేటంతవరకూ అది ప్రయాణిస్తూనే వుంటుంది. గాలిలో దాన్ని అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే, పక్కకు తొలుగుతుంది తప్ప... తనశక్తిని చూపించదు... కాని పేలటం అంటూ సంభవిస్తే దానిదెబ్బ చాలా దాఋణంగా వుంటుంది. అటువంటి ఫ్లయింగ్ బాంబ్ యీ షాడో..... అడ్డుపడటానికి ప్రయత్నించి.... మా గాంగ్ ఏమయిందో చూశారా?” అన్నాడు ఇబ్రహీం.

గాడంగా నిట్టూర్చి ... ఫోన్ అందుకుంది దౌలత్ – తన ఎంప్లాయర్స్‌కి రిపోర్టు చేయటానికి.

ఫ్లయింగ్ బాంబ్ యింటిదారి పట్టింది..... పొరపాటున బోర్డర్స్‌లో ఎవరైనా అడ్డుకుంటే – కథ మళ్ళీ మొదటికి వచ్చే ప్రమాదం వుంది.

:జై హింద్: